# వాస్తవం

డిజిటల్ పత్రిక

ఉన్నది ఉన్నట్లుగా

డెయిలీ. కామ్

ఆదివారం
22.03.2026

ఎడిటర్: ఎం.కృష్ణారెడ్డి


## నేడు సిద్దిపేటకు సీఎం రాక

నర్మెట్ట బహిరంగ సభలో రైతు భరోసా నిధులు విడుదల



9లో..

వివిధ రంగాల్లో ప్రముఖులుగా చెలామణి అవుతున్న వారు తమ నోటిని అదుపులో ఉంచుకోవాల్సిన బాధ్యత ఎంతైనా ఉంది.వేదిక దొరికి మైకు అందితే హద్దు మీరి ప్రసంగాలు..సిగ్గుపడేలా పొగడ్తలు చేయడాలు మానుకోవాలి.హుందాగా విషయం మీద మాట్లాడితే ప్రజల్లో తమ హెూదాలు,పదవులకు గౌరవం నిలుస్తుంది.అది మరచి అనవసర ప్రసంగాలు చేస్తే జనం ఛీకొడతారు.తమ కులం వాడు వీరుడు..శూరుడు..అమెరికాకు ప్రెసిండెంట్ అవుతాడని అధిక ప్రసంగాలు చేసే నాయకులను చూశాం.ఆ ప్రసంగాలను అహెూ..ఒహెూ బ్రహ్మాండం అంటూ ఊదరగొట్టే భజన మీడియాలను చూశాం.

# మైకు దొరికితే అదుపుతప్పుతం

## »అనవసర ప్రసంగాలు..ఆకాశానికెత్తే పొగడ్తలు



కె.ఆర్ ఉన్నమాట

ప్రముఖుల పేరుతో కొందరు చేస్తున్న అతి ప్రసంగాలు వివాదాలకు తావిస్తున్నాయి.వివిధ రకాల వేదికల మీద సినీ ప్రముఖులు,రాజకీయ నేతలు,ఇతర రాజ్యాంగ హెూదాల్లో ఉన్నవారు, వివిధరంగాల్లోని ప్రముఖులు విచక్షణత కోల్పోయి వివాదాస్పద వ్యాఖ్యలు చేస్తున్నారు. వేదిక దొరికి మైకు అందితే రెచ్చిపోతున్నారు.నవ్విపోదురుగాక మాకేంటి అనే తరహాలో పొగడ్తలతో ఆకాశానికెత్తుతారు..సందర్భం లేకుండా విమర్శలు చేస్తుంటారు. అనంతరం నలువైపుల నుంచి విమర్శలు రాగానే మాకు అలాంటి ఉద్దేశ్యం లేదు..నేను కావాలని అలా అనలేదు..నన్ను క్షమించండంటూ ఓ వీడియో తీసి చేతులు దులుపుకుంటున్నారు.

9లో..

- సందర్భం లేని వ్యాఖ్యలు చేయడం.. అనక నాలుక కరుచుకోవడం
- ప్రముఖుల పేరుతో చెలామణిలో ఉన్న కొందరి చేష్టలు విమర్శలపాలు
- పిల్లల తిండిపై గరికపాటి సంచలన వ్యాఖ్యలు..
- సోషల్ మీడియాలో నెటిజన్ల ఫైర్
- నేడు గరికపాటి..రేపు ఇంకెవరో?
- అదుపులేని రోతలు..చేతలు

తాజాగా ప్రముఖ ప్రవచనకర్త గరికపాటి నరసింహారావు ప్రభుత్వ పాఠశాలల్లో అమలు చేస్తున్న మధ్యాహ్న భోజన పథకంపై చేసిన వివాదాస్పద వ్యాఖ్యలు ప్రస్తుతం తెలుగు రాష్ట్రాల్లో పెను దుమారాన్ని రేపుతున్నాయి. ఒక ప్రసంగం సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు ఉచితంగా భోజనం పెట్టడం, పుస్తకాలు, బట్టలు ఇవ్వడాన్ని తీవ్రంగా తప్పుబట్టారు. ఈ క్రమంలో ఆయన పాఠశాలకు వచ్చే పిల్లలను "శోభనపు పెళ్ళికొడుకులతో" పోల్చడం తీవ్ర విమర్శలకు దారితీసింది. విద్యార్థులు చదువు కోసం కాకుండా కేవలం ఉచిత భోజనం కోసమే బడికి వస్తున్నారనే అర్థం వచ్చేలా ఆయన మాట్లాడటంపై నెటిజన్లు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

# జీవన్ రెడ్డి కారెక్కుడు ఖాయమే?

**మంత్రులతో చర్చలు విఫలం**

**అవమానాలను భరించుకుంటూ పార్టీలో ఉండలేని తేల్చిన జీవన్‌రెడ్డి**

**ముగిసిన మంత్రులు శ్రీధర్ బాబు, అడ్లూరి లక్ష్మణ్‌ల భేటీ**

**జగిత్యాల, మార్చి 21:**

కాంగ్రెస్ నేత జీవన్ రెడ్డితో మంత్రులు శ్రీధర్ బాబు, అడ్లూరి లక్ష్మణ్‌ల భేటీ ముగిసింది.వీరి మధ్య జరిగిన బుజ్జగింపు చర్చలు విఫలమయినట్లుగా తెలుస్తోంది.అవమానాలు భరిస్తూ పార్టీలో కొనసాగిస్తూ పార్టీలో కొనసాగలేనని మంత్రులకు జీవన్‌రెడ్డి తేల్చిచెప్పినట్లుగా సమాచారం.దీంతో త్వరలోనే జీవన్ రెడ్డి పార్టీ మార్పు ఖాయంగా కన్పిస్తోంది. ఆయన బీజేపీలోకి వెళతారని కొందరు..కాదు బీఆర్ఎస్‌లోకి పోతారని మరికొందరు ప్రచారం చేస్తున్నారు.అయితే బీజేపీ కన్నా జీవన్‌రెడ్డి ఛాయిస్ బీఆర్ఎస్ వైపే ఉండే అవకాశం అధికంగా ఉంది. పార్టీ పెద్దల తీరుపై గత కొంతకాలంగా తీవ్ర అసంతృప్తితో ఉన్న జీవన్ రెడ్డి.. కాంగ్రెస్‌కు గుడ్ బై చెప్పి.. బీఆర్ఎస్ పార్టీలో చేరుతారనే ప్రచారం జరుగుతోంది. ఈనేపథ్యంలో జీవన్ రెడ్డిని కలిసిన మంత్రులు.. ఆయనను బుజ్జగించే ప్రయత్నం చేశారు. చాలా సమయం జీవన్ రెడ్డితో చర్చలు జరిపిన మంత్రులు.. పార్టీలో ఆయనకు సముచిత ప్రాధాన్యం దక్కేలా అధిష్ఠానం చూసుకుంటుందని హామీ ఇచ్చినట్లు తెలుస్తోంది. అయితే, వీరి బుజ్జగిం పులు సఫలీకృతం అయిన ట్లుగా కనిపించడం లేదు.జీవన్ రెడ్డితో భేటీ అనం తరం మంత్రి శ్రీధర్ బాబు మీడియాతో మాట్లా డారు. పార్టీ మారే విషయంలో ఎలాంటి నిర్ణయం తీసుకోవద్దని జీవన్ రెడ్డిని కోరామని మంత్రి తెలి పారు. జీవన్ రెడ్డికి పార్టీ అండగా నిలబడే ఆలోచన చేస్తుందన్నారు. ఆయనతో చర్చించిన అంశాలను పార్టీ, ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్తామన్నారు. జగి త్యాల ప్రాంతానికి జీవన్ రెడ్డి పెద్దదిక్కు అని.. అభి వృద్ధి కోసమే 10 మంది ఎమ్మెల్యేలను తీసుకు న్నామని మంత్రి శ్రీధర్ బాబు చెప్పారు. జీవన్ రెడ్డి గురించి తెలంగాణ రాష్ట్రంలో తెలియని వారు ఎవరూ ఉండరన్నారు. ప్రతిపక్షంలో ఉన్నా ప్రజల గొంతుకగా ఉన్న నాయకుడు జీవన్ రెడ్డి అని అన్నారు. జీవన్ రెడ్డి బాధపడితే తాము బాధపడి నట్లేనని అన్నారు. కాంగ్రెస్ నాయకులు మీనాక్షి నటరాజన్, పీసీసీ అధ్యక్షులు మహేష్ గౌడ్, మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డిలు జీవన్ రెడ్డితో గతంలో మాట్లాడారని మంత్రి తెలిపారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు ఎదుర్కొంటున్న సమస్యలను జీవన్ రెడ్డి తమ దృష్టికి తీసుకువచ్చారన్నారు. ఈ వివరాలను




పార్టీ అధిష్ఠానం దృష్టికి తీసుకెళ్తామని మంత్రి చెప్పారు.తన పట్ల పార్టీ పెద్దలు అనుసరిస్తున్న వైఖరిపై మంత్రుల వద్ద జీవన్ రెడ్డి తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసినట్లు తెలుస్తోంది. ఇన్ని అవమానాలు ఎదుర్కొంటూ పార్టీలో ఇంకా ఎందుకు కొనసాగా లని మంత్రులను ప్రశ్నించారు జీవన్ రెడ్డి. పార్టీలో గౌరవం లేనప్పుడు ఎందుకు ఉండాలని నిలదీశారు. దీంతో మీ సమస్యకు పరిష్కారం ఏంటని జీవన్ రెడ్డిని ప్రశ్నించారు మంత్రులు. స్పందించిన జీవన్ రెడ్డి.. పార్టీ ఫిరాయించిన 10 మంది ఎమ్మెల్యేలను పక్కన పెట్టడమే తన సమస్యకు పరిష్కారమని మంత్రులకు తేల్చి చెప్పారు.

# అది గరికపాటి మనస్సులోని విషం

**బడి పిల్లల తిండి వ్యాఖ్యలపై ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ ఫైర్**





**హైదరాబాద్:**

ప్రముఖ ప్రవచనకర్త గరికపాటి నరసింహారావు ప్రభుత్వ పాఠశాలల్లో అమలు చేస్తున్న మధ్యాహ్న భోజన పథకంపై చేసిన వివాదాస్పద వ్యాఖ్యలు ప్రస్తుతం పెను దుమా రాన్ని రేపిన సంగతి తెలిసిందే. ఒక ప్రసంగం సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు ఉచితంగా భోజనం పెట్టడం, పుస్తకాలు, బట్టలు ఇవ్వడాన్ని తీవ్రం గా తప్పుబట్టడమే కాకుండా, పాఠశాలకు వచ్చే పిల్లలను శోభనపు పెళ్ళికొడుకులతో పోల్చడం తీవ్ర విమర్శలకు దారితీసింది.నెటిజన్లు ఆగ్ర హం వ్యక్తం చేస్తుండగా.. తాజాగా ఈ వ్యవ హారంపై బీఆర్ఎస్ నేత ఆర్.ఎస్. ప్రవీణ్ కుమార్ ఎక్స్ వేదికగా అత్యంత ఘాటుగా స్పందించారు.'గరికపాటి తన మనసులో ఉన్న కుసంస్కారాన్ని బయటపెట్టారని, ఈ సమాజంలోని ఆధిపత్య వర్గాలకు, మేధావులకు తరతరాలుగా పేదవారి చదువు, వారు తినే తిండిపై ఇలాంటి చులకన భావమే ఉంటుందని ఆయన మండిపడ్డారు. గరికపాటి లాంటి వారు గడ్డి మాటలు మాట్లాడుతుంటే, ఆయన ప్రవచనాలకు చప్పట్లు కొడుతున్న మూర్ఖులను చూస్తుంటే జాలి వేస్తోందని ఆర్.ఎస్ ఆవేదన వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా ప్రస్తుతం ఉన్న రాజకీయ వివక్షను కూడా ప్రవీణ్ కుమార్ ఎత్తిచూపారు. మొన్న దళిత ఎమ్మెల్యే మందుల సామేలు ఇంటిపై దాడి చేసిన బండి సంజయ్ మరియు బీజేపీ గ్యాంగ్, ఇప్పుడు బ్రాహ్మణ వర్గానికి చెందిన గరికపాటి ఇంటికి వెళ్తారా? అని ఆయన ప్రశ్నించారు. పోలీసులు కూడా గరికపాటిపై కేసులు పెట్టరని, జాతీయ బాలల హక్కుల సంఘం లేదా మానవ హక్కుల సంఘం ఆయనను కనీసం పిలిచి అడగవని విమర్శించారు. పేద పిల్లలు పోషకాహారం అందక అస్థిపంజరాలుగా మారి, బీజేపీ మరియు కాంగ్రెస్ పార్టీల జెండాలు మోసే రోబోలుగా మిగిలిపోవాలని వారు కోరుకుంటున్నారని దుయ్యబట్టారు. గరికపాటి లాంటి వ్యక్తులపై కేసులు పెట్టి చంచల్‌గూడ 'అండా' సెల్‌లో వేసినప్పుడే తెలుగు రాష్ట్రాల్లో నిజమైన విజ్ఞానం వికసిస్తుందని ఆయన స్పష్టం చేశారు. పేదరికం, వివక్ష ఈ దేశంలో నేటికీ పోకపోవడానికి గరికపాటి లాంటి వారి ఆలోచనలే కారణమని, అందుకే రోహిత్ వేముల లాంటి వారు బలవుతున్నారని' ఆర్.ఎస్. ప్రవీణ్ కుమార్ తన పోస్ట్‌లో పేర్కొన్నాడు.

# కరీంనగర్ టూటౌన్ ఎస్ఐ ఆత్మహత్య

**భార్య మృతిని తట్టుకోలేకే**

**ఐదు రోజుల వ్యవధిలోనే భార్యాభర్తల బలవన్మరణం**



భార్య మరణాన్ని తట్టుకోలేక కరీంనగర్ టూ టౌన్ ఎస్ఐ చంద్రశేఖర్ ఆత్మహత్య చేసుకున్నారు.

8లో..

జీవనరెడ్డి రాజీనామాకు

# ముహూర్తం ఫిక్స్

**కాంగ్రెస్ పార్టీకి మాజీ మంత్రి జీవన రెడ్డి రాజీనామా ముహూర్తం దాదాపుగా ఖరారైనట్లు తెలుస్తోంది. ఈనెల 25వ తేదీన అనుచరులతో కలిసి జీవనరెడ్డి రాజీనామా చేయనున్నట్లు సమాచారం.**

8

## కాటారంలో ఘనంగా ప్రపంచ అటవీ దినోత్సవం



వాస్తవం : కాటారం

ప్రపంచ అటవీ దినోత్సవాన్ని పురస్కరించుకుని కాటారం మండలం అటవీ రేంజ్ కాంప్లెక్స్‌లో మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించారు. ప్రకృతి పరిరక్షణకు ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యత నిర్వర్తించాలనే లక్ష్యంతో ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ కార్యక్రమంలో అటవీ క్షేత్రాధికారి జె. స్వాతి పాల్గొని మొక్కలు నాటారు. ఆమెతో పాటు డిప్యూటీ రేంజర్లు సురేందర్, శ్రీనివాస్, బీట్ అధికారులు, బేస్ క్యాంప్ వాచర్స్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ–అటవీ సంపద మన జీవనాధారమని, చెట్లు లేకుండా జీవం సాధ్యం కాదని పేర్కొన్నారు. వాతావరణ మార్పులు, కాలుష్యం వంటి సమస్యలను ఎదుర్కోవాలంటే విస్తృతంగా మొక్కలు నాటడం అవసరమని తెలిపారు. ప్రతి వ్యక్తి కనీసం ఒక మొక్క అయినా నాటి, దాన్ని సంరక్షిస్తే పర్యావరణాన్ని కాపాడటంలో గొప్ప మార్పు తీసుకురాగలమని వారు అన్నారు. భవిష్యత్ తరాలకు ఆరోగ్యకరమైన, స్వచ్ఛమైన వాతావరణాన్ని అందించడమే ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు.

## దౌల్తాబాద్ మండలంలో ఘనంగా రంజాన్ వేడుకలు



వాస్తవం : దౌల్తాబాద్

దౌల్తాబాద్ మండల వ్యాప్తంగా రంజాన్ పండుగను ముస్లిం సోదరులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉదయం మసీదుల్లో ప్రత్యేక నమాజ్‌లు నిర్వహించి అల్లాహ్‌కు ప్రార్థనలు చేశారు. పండుగను పురస్కరించుకుని ముస్లింలు కొత్త దుస్తులు ధరించి కుటుంబ సభ్యులు, బంధువులతో ఆనందంగా గడిపారు. మసీదుల వద్ద పెద్ద సంఖ్యలో ముస్లింలు చేరుకొని ప్రార్థనలు చేశారు. అనంతరం ఒకరినొకరు ఆలింగనం చేసుకొని రంజాన్ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. ఈ సందర్భంగా పేదలకు జకాత్, ఫిత్రా రూపంలో సహాయం అందించారు. ప్రజాప్రతినిధులు, అధికారులు ముస్లిం సోదరులకు రంజాన్ పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు.

## అందోల్‌లో ఘనంగా రంజాన్ వేడుకలు



వాస్తవం : అందోల్

రంజాన్ పర్వదినాన్ని పురస్కరించుకొని అందోల్ మండలంలోని గ్రామ గ్రామాలలో పండుగ వేడుకలను ఘనంగా నిర్వహించుకున్నారు. ఉదయం నుండే మైనార్టీ సోదరులు నూతన వస్త్రాలు ధరించిఆయా ఈద్గాల వద్ద ప్రత్యేక ప్రార్థనలు చేసి ఒకరికొకరు పండగ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. కులమతాలకు అతీతంగా మైనార్టీ సోదరులు ఆలింగనం చేసుకుంటూ రంజాన్ శుభాకాంక్షలు తెలుపుకున్నారు.

# వేములవాడ శ్రీ భీమేశ్వర స్వామి ఆలయంలో ఐజిపి చంద్రశేఖర్ రెడ్డి ప్రత్యేక పూజలు

వాస్తవం : వేములవాడ

ప్రముఖ పుణ్యక్షేత్రమైన వేములవాడ శ్రీ భీమేశ్వర స్వామి ఆలయంలో శనివారం మల్టీ జోన్ – 1 ఐజిపి చంద్రశేఖర్ రెడ్డి శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేములవాడ ఆలయానికి చంద్రశేఖర్ రెడ్డి వచ్చిన సందర్భంగా ఆలయ పూజారులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. ఆలయ ముఖ్య కార్యాచరణ అధికారి ఎల్ రమాదేవి స్వామి వారి తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఈ సందర్భంగా చంద్రశేఖర్ రెడ్డి పోలీస్ అధికారులతో మాట్లాడుతూ..... దక్షిణకాశిగా పేరుగాంచిన వేములవాడకు దేశం నలుమూలల నుండి భక్తులు భారీగా తరలివస్తారని, స్వామివారి దర్శనానికి వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా సమగ్ర భద్రతా ఏర్పాట్లు చేపట్టాలని ఆదేశించారు. భక్తుల రాకపోకలు సాఫీగా సాగేందుకు ట్రాఫిక్ నియంత్రణపై ప్రత్యేక దృష్టి పెట్టాలని, ఆలయ పరిసర ప్రాంతాల్లో గస్తీ పెంచాలని సూచించారు. అలాగే అనుమానాస్పద వ్యక్తులపై నిఘా ఉంచుతూ, ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా అప్రమత్తంగా ఉండాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు ఎస్పీ చంద్రయ్య, వేములవాడ,సిరిసిల్ల,డీఎస్పీలుశ్రీనివాసులు, నాగేంద్రచారి,సిఐ లు, ఆర్ఐ లు, ఎస్ఐ లు పాల్గొన్నారు.





# కొండగట్టు అంజన్న దర్శించుకున్న కేంద్రమంత్రి బండి సంజయ్

### కొండగట్టు ఆంజనేయస్వామి ఈ ప్రత్యేక పూజలు నిర్వహించిన కేంద్రమంత్రి బండి సంజయ్

వాస్తవం : కొడిమ్యాల

జగిత్యాల జిల్లా మల్యాల మండలం కొండగట్టు శ్రీ ఆంజనేయస్వామి ఆలయం శనివారం రోజున అధ్యాత్మిక వాతావరణం తో కళకళలాడింది కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ గత శనివారం నిర్వహించిన అంజన్న ఆశీర్వాద యాత్ర సందర్భంగా స్వామివారి సన్నిధి కి చేరుకునేసరికి ఆలస్యం కావడంతో ఆలయం మూసి వేశారు. దీంతో ఆయన ఆలయ ముఖ ద్వారం వద్దనే మొక్కు చెల్లించుకున్నారు కాగా ఈరోజు శనివారం మళ్లీ ఆయన స్వామివారి దర్శించుకునేందుకు వచ్చారు. ఈ సందర్భంగా అర్చకులు అధికారులు ఆయనకు ఘన స్వాగతం పలికారు బండి సంజయ్ ఆలయ ప్రాంగణంలో ప్రదక్షిణలు చేసి అనంతరం గర్భగుడిలోకి ప్రవేశించి ప్రత్యేక పూజలు నిర్వహించారు ఆలయ అర్చకులు శాలువతో సన్మానిచ్చి ఆశీర్వచనాన్ని స్వామివారి ప్రసాదాన్ని అందజేశారు ఈ కార్యక్రమంలో కరీంనగర్ మేయర్ కొలకాని శ్రీనివాస్, నాయకులు బోయిన్పల్లి ప్రవీణ్ రావు, బండ రమణారెడ్డి, మల్యాల మండల అధ్యక్షులు గాజుల మల్లేశం, బొట్ల ప్రసాద్, బండ లింగారెడ్డి, బండ నర్సింహా రెడ్డి, పార్టీ కార్పొరేటర్లు, సర్పంచులు ,ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



# వర్ధన్నపేటలో ఘనంగా రంజాన్ వేడుకలు

### మైనార్టీల సంక్షేమమే ప్రజా ప్రభుత్వ ప్రధాన ధ్యేయం
### రంజాన్ పర్వదినాన్ని పురస్కరించుకొని ముస్లిం సోదర సోదరీమణులకు పర్వదిన శుభాకాంక్షలు తెలియజేసిన ఎమ్మెల్యే నాగరాజు

వాస్తవం : వర్ధన్నపేట

పవిత్ర రంజాన్ మాసం ముగింపు సందర్భంగా వర్ధన్నపేట పట్టణంలో రంజాన్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. స్థానిక ఈద్గా వద్ద ఏర్పాటు చేసిన ఈద్–ఉల్–ఫితర్ ప్రత్యేక ప్రార్థనల్లో వర్ధన్నపేట నియోజకవర్గ ఎమ్మెల్యే, విశ్రాంత ఐపీఎస్ అధికారి కేఆర్ నాగరాజు ముఖ్య అతిథిగా పాల్గొని ముస్లిం సోదర సోదరీమణులకు పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాగరాజు పలుగురికి ముస్లిం కుటుంబాలకు రంజాన్ తోఫా తో పాటు నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాగరాజు మాట్లాడుతూ, క్రమశిక్షణ, దానగుణం, సోదరభావానికి రంజాన్ పండుగ ప్రతీక అని కొనియాడారు. నియోజకవర్గ ప్రజలందరూ సుఖశాంతులతో, ఐశ్వర్యాలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు. రంజాన్ పర్వదినం సందర్భంగా ముస్లిం సోదరులను ఆలింగనం చేసుకొని శుభాకాంక్షలు తెలిపారు. రంజాన్ పండుగను ముస్లిం సోదరులు నెల రోజుల పాటు ఉపవాస దీక్షలు చేపట్టి రంజాన్ పండుగ చివరి రోజు పండుగను జరుపుకొని ఒకరికొకరు శుభాకాంక్షలు తెలుపుతూ ఆనందంగా గడుపడం సంతోషకరంగా ఉందన్నారు. ఈద్గాల అభివృద్ధి కోసం నిధులు మంజూరు చేసి వసతులు కల్పించడం జరిగిందన్నారు మైనార్టీల ఆర్థిక స్వావలంబన దిశగా రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తుందని తెలిపారు. రంజాన్ కానుకగా ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇళ్ల పథకం కింద మైనార్టీ వర్గానికి కేటాయించిన నూతన గృహాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. పేదలకు సొంతింటి కలను సాకారం చేయడమే ఇందిరమ్మ రాజ్యం లక్ష్యమని, రంజాన్ పర్వదినాన ఆ కుటుంబాన్ని కొత్త ఇంటిలోకి పంపడం ఎంతో ఆనందంగా ఉందని పేర్కొన్నారు ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, ముస్లిం మత పెద్దలు, పార్టీ నాయకులు, స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



# కేంద్ర నిధులతోనే గ్రామాల అభివృద్ధి వేగవంతం

## ముత్యంపేటలో రూ.10 లక్షల సీసీ రోడ్డు పనులకు శ్రీకారం





వాస్తవం : దౌల్తాబాద్

కేంద్ర ప్రభుత్వ నిధులతో గ్రామాల అభివృద్ధి వేగవంతంగా కొనసాగుతోందని బిజెపి మండల అధ్యక్షులు దేవుడి లావణ్య నరసింహారెడ్డి అన్నారు. దౌల్తాబాద్ మండలం ముత్యంపేట గ్రామంలో మెదక్ ఎంపీ రఘునందన్ రావు సహకారంతో మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం (ఎన్ఆర్ఈజీఎస్) కింద రూ. 10 లక్షల వ్యయంతో సీసీ రోడ్డు నిర్మాణ పనులను సర్పంచ్ సునీత స్వామి తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం గ్రామాల అభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని పేర్కొన్నారు. గ్రామాల్లో మౌలిక వసతుల మెరుగుదల కోసం నిధులు సమకూర్చుతూ అభివృద్ధి కార్యక్రమాలను వేగవంతం చేస్తోందన్నారు. ఎంపీ రఘునందన్ రావు సహకారంతో మండలంలోని పలు గ్రామాల్లో రహదారులు, డ్రైనేజీలు, ఇతర మౌలిక వసతుల పనులు కొనసాగుతున్నాయని తెలిపారు. సర్పంచ్ సునీత స్వామి మాట్లాడుతూ గ్రామ ప్రజలకు అవసరమైన సౌకర్యాలను కల్పించడమే తమ ప్రధాన లక్ష్యమని తెలిపారు. ఈ సీసీ రోడ్డు నిర్మాణంతో గ్రామంలో రాకపోకలు సులభతరం అవుతాయని, ముఖ్యంగా వర్షాకాలంలో ఎదురయ్యే మురికి, బురద సమస్యలకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని అన్నారు. ఎంపీ సహకారంతో గ్రామంలో అభివృద్ధి పనులు జరుగుతుండటం సంతోషకరమని అన్నారు. భవిష్యత్తులో మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ కర్ణాకర్, కోనాయిపల్లి మాజీ సర్పంచ్ సురేందర్ రెడ్డి, వార్డు సభ్యులు, బిజెపి నాయకులు పాల్గొన్నారు.

# రైతు ఉత్సవాలకు వెళ్లిన రుద్రంగి రైతులు

## ఏఎంసీ చైర్మన్ ఆధ్వర్యంలో కదిలిన రైతాంగం



వాస్తవం : రుద్రంగి

తెలంగాణ రైతు ఉత్సవాల్లో భాగంగా సిద్దిపేటలో జరుగుతున్న సదస్సుకి శనివారం రోజున రుద్రంగి మండల కేంద్రం నుండి ఏఎంసీ చైర్మన్ చేలుకల తిరుపతి నేతృత్వంలో రైతులు అధిక సంఖ్యలో తరలి వెళ్లారు. రైతు సదస్సులో వ్యవసాయ పనిముట్ల వాడకం, కూరగాయల సాగు నూతన వంగడాలు,నష్ట నివారణ చర్యలు,ఆధునిక వ్యవసాయ రంగ ఉత్పత్తులు వాటి పద్ధతులపై అవగాహన కార్యక్రమాన్ని ఆసక్తిగా తిలకించినట్టు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో రుద్రంగి గ్రామ ప్రముఖులు రైతాంగం పాల్గొన్నారు.

# మల్లన్న సాగర్ నిర్వాసితుల సమస్యలపై సీఎం స్పందించాలి

సీఎం పర్యటనలో నిర్వాసితుల సమస్యలు ప్రస్తావించాలి

పునరావాసం, నష్టపరిహారాలపై స్పష్టత కోరిన సిఐటియు

కోర్టు తీర్పులు అమలు చేయాలని డిమాండ్

కాలనీల్లో మౌలిక వసతులు కల్పించాలని విజ్ఞప్తి



వాస్తవం : గజ్వేల్ ఆర్ సి

నర్మెట్టలో జరుగుతున్న రైతు పర్యటనలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మల్లన్న సాగర్ నిర్వాసితుల సమస్యలపై ముందుగా స్పందించి వారికి న్యాయం చేయాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షుడు బండ్ల స్వామి డిమాండ్ చేశారు. స్థానిక విలేకరులతో మాట్లాడిన ఆయన మల్లన్న సాగర్‌తో పాటు రంగనాయక సాగర్, కొండపోచమ్మ సాగర్, అనంతగిరి, గౌరవెల్లి ప్రాజెక్టుల నిర్వాసితుల సమస్యలను ప్రస్తావించిన తర్వాతే ఇతర అంశాలపై మాట్లాడాలని కోరారు. నిర్వాసితులను ఆదుకునేలా అధికారులకు స్పష్టమైన ఆదేశాలు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. ప్రాజెక్టు నిర్మాణ సమయంలో భూసేకరణకు వ్యతిరేకంగా నిర్వాసిత గ్రామాల ప్రజలు ఆందోళనలు చేపట్టిన విషయాన్ని గుర్తు చేశారు. అప్పట్లో ప్రస్తుత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కూడా నిర్వాసితుల పక్షాన ఏటిగడ్డ కిష్టాపూర్‌లో నిరాహార దీక్ష చేసినట్లు తెలిపారు. అయినప్పటికీ గతంలో టిఆర్ఎస్ ప్రభుత్వం నిర్వాసితుల ఆందోళనలను పట్టించుకోకుండా ప్రాజెక్టు పనులు కొనసాగించిందని విమర్శించారు. ఇప్పటికీ సరైన నష్టపరిహారం, పునరావాస ప్యాకేజీలు, ఇండ్లు, ప్లాట్లు అందక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. కొందరు మానసిక వేదనతో ప్రాణాలు కోల్పోయిన ఘటనలు కూడా ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. కోర్టులు నిర్వాసితుల పక్షాన తీర్పులు ఇచ్చినప్పటికీ వాటిని అమలు చేయడంలో అధికారులు విఫలమవుతున్నారని ఆరోపించారు. వెంటనే జోక్యం చేసుకుని కోర్టు తీర్పులు అమలు చేయించేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. నిర్వాసిత కుటుంబాలకు ఎలాంటి షరతులు లేకుండా రైతు బీమా, రైతు భరోసా తరహాలో దీర్ఘకాలిక సహాయం అందించే ప్రత్యేక పథకం ప్రకటించాలని కోరారు. గజ్వేల్ పట్టణంలో ఏర్పాటు చేసిన కాలనీల్లో కనీస మౌలిక వసతులు లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, స్మశాన వాటికలు, విద్య, వైద్య సదుపాయాలు, రహదారులు, డ్రైనేజీ సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ఇచ్చిన హామీలను గుర్తుచేసుకుంటూ, నేడు నర్మెట్టలో జరిగే సభలో నిర్వాసితుల పట్ల చిత్తశుద్ధిని నిరూపించుకోవాలని కోరారు. లేనిపక్షంలో సిఐటియు ఆధ్వర్యంలో నిర్వాసితులతో కలిసి ఐక్య పోరాటాలు చేపడతామని హెచ్చరించారు.

# కామారెడ్డి డిక్లరేషన్‌కు కార్యరూపం ఎప్పుడూ..?

బీసీలకు ఇచ్చిన హామీలు ఏమయ్యాయని ప్రశ్న

ప్రతి బడ్జెట్‌లో రూ.20 వేల కోట్లు ఎక్కడ..?

బీసీ సంక్షేమాన్ని నిర్లక్ష్యం చేస్తున్న కాంగ్రెస్

జాగృతి రాష్ట్ర ఉపాధ్యక్షుడు కొట్టాల యాదగిరి ముదిరాజ్



వాస్తవం : గజ్వేల్ ఆర్ సి

కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో బీసీలకు ఇచ్చిన హామీలు ఏమయ్యాయని జాగృతి రాష్ట్ర ఉపాధ్యక్షుడు కొట్టాల యాదగిరి ముదిరాజ్ ప్రశ్నించారు. శనివారం గజ్వేల్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ కామారెడ్డి డిక్లరేషన్‌ను ప్రభుత్వం పట్టించుకోవడం లేదని, ప్రతి బడ్జెట్ లో బీసీలకు రూ. 20 వేల కోట్లు కేటాయిస్తామని చెప్పిన హామీ అమలు కాలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. గత ప్రభుత్వంలాగే ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం కూడా బీసీల సంక్షేమం, సాధికారతను నిర్లక్ష్యం చేస్తోందని విమర్శించారు. అమలు చేస్తున్న పథకాలకు కూడా సరైన ప్రాధాన్యత ఇవ్వడంలేదని ఎద్దేవా చేశారు. జనాభా ప్రాతిపదికన నిధులు కేటాయించాల్సిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అందుకు భిన్నంగా వ్యవహరిస్తున్నారని అన్నారు. అద్దె భవనాల్లో కొనసాగుతున్న బీసీ కళాశాలలు, గురుకులాలకు సరైన నిధులు కేటాయించకపోవడం దురదృష్టకరమని పేర్కొన్నారు. బడుగు వర్గాల విద్యార్థుల భవిష్యత్తును దెబ్బతీస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం కనీసం బీసీ కార్పొరేషన్లకు కూడా బడ్జెట్‌లో నిధులు కేటాయించలేదని గుర్తు చేశారు. ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే బీసీ విద్యార్థులు, చేతివృత్తులు, కులవృత్తులకు ప్రోత్సాహం కల్పిస్తూ నిధులు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను వెంటనే విడుదల చేయాలని కోరారు. బీసీ విద్యార్థుల ఉన్నత విద్యను అడ్డుకునే ప్రయత్నాలు చేస్తే తగిన మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుం దని హెచ్చరించారు. బీసీలకు న్యాయం చేయకపోతే జాగృతి ఆధ్వర్యంలో ప్రజా పోరాటాలు చేపడతామని స్పష్టం చేశారు.

# మియాపూర్ మెట్రో గ్రౌండ్‌లో క్రికెట్ పోటీలు




## పాల్గొన్న అట్టేపల్లి రామప్రభు

వాస్తవం : శేరిలింగంపల్లి

శేరిలింగంపల్లి నియోజకవర్గం మియాపూర్ డివిజన్ పరిధిలోని మియాపూర్ మెట్రో గ్రౌండ్‌లో ఈనెల 20 నుండి 22 వరకు నిర్వహించనున్న క్రికెట్ టోర్నమెంట్ ను అట్టేపల్లి లక్ష్మీ నారాయణ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ అట్టేపల్లి రామప్రభు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన స్థానిక యువతతో కలిసి ఉత్సాహంగా గడుపుతూ, క్రీడాకారులను ప్రత్యేకంగా అభినందించారు. యువత క్రీడల్లో రాణించడం ద్వారా శారీరక దృఢత్వంతో పాటు క్రమశిక్షణ అలవడుతుందని ఆయన పేర్కొన్నారు. క్రీడాకారుల్లో నూతనోత్సాహం నింపుతూ, వారికి తన పూర్తి మద్దతు ఉంటుందని ఈ సందర్భంగా రామప్రభు హామీ ఇచ్చారు.

# రాష్ట్ర బడ్జెట్‌ను సవరించి విద్యారంగానికి 30 శాతం నిధులు కేటాయించాలి

## పెండింగ్ లో ఉన్న బకాయిలను తక్షణమే విడుదల చేయాలి
## సిరిసిల్లలో బడ్జెట్ పత్రాల దహనం
## ఎస్ ఎఫ్ ఐ జిల్లా ఉపాధ్యక్షులు శ్రీరాములు సంజన




వాస్తవం : సిరిసిల్ల

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం బడ్జెట్ ను సవరించి విద్య రంగానికి 30 శాతం కేటాయించాలని, పెండింగ్ లో ఉన్న బకాయిలను తక్షణం విడుదల చేయాలని ఎస్ఎఫ్ఐ రాజన్న సిరిసిల్ల జిల్లా ఉపాధ్యక్షులు శ్రీరాముల సంజన డిమాండ్ చేశారు.బడ్జెట్ పూర్తిగా విద్యా వ్యతిరేకమైనదని బడ్జెట్ పత్రాలను సిరిసిల్ల పట్టణంలో శనివారం దగ్ధం చేయడం జరిగింది.ఈ సందర్భంగా శ్రీరాముల సంజన మాట్లాడుతూ... కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వస్తే విద్యార్థులకు సకాలంలో స్కాలర్ షిప్ లు,ఫీజు రీయింబర్స్మెంట్ లు వస్తాయని ఎదురు చూస్తే కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా భిన్నంగా వ్యవహరిస్తున్న పరిస్థితి కనిపిస్తుందని, కాంగ్రెస్ తన మేనిఫెస్టోలో విద్యారంగానికి 15 శాతం ఇస్తామని హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చిన తర్వాత హామీలను మర్చిపోయిన పరిస్థితి ఉందని,ఇప్పటికే రాష్ట్రవ్యాప్తంగా దాదాపు 9వేల కోట్లకు పైగా పెండింగ్ లో బకాయిలు ఉన్న పరిస్థితి ఉందని,సంక్షేమ హాస్టల్లో విద్యార్థులు అనేక సమస్యలతో ఇబ్బంది పడుతున్న దానిపైన ఎలాంటి ప్రస్తావన అసెంబ్లీ సమావేశాలలో లేదని, కావున తక్షణమే రాష్ట్ర బడ్జెట్ని సవరించి విద్యారంగానికి 30 శాతం నిధులను కేటాయించాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ కమిటీ సభ్యులు రేవతి, శ్రావ్య, శరణ్య, విక్రమ్, మనోజ్, సందేశ్, తదితరులు పాల్గొన్నారు.

# ముస్లిం సోదరులకు ఉద్యమ కళాకారుల ఫోరం శుభాకాంక్షలు



వాస్తవం : వేములవాడ

వేములవాడ పట్టణంలో శనివారం నిర్వహించే రంజాన్ వేడుకల్లో పాల్గొని తెలంగాణ ఉద్యమ కళాకారుల రాష్ట్ర కన్వీనర్ కళా తపస్వి యెల్ల పోశెట్టి వేములవాడ ఈద్గా వద్ద ముస్లిం సోదరులు పవిత్ర రంజాన్ ప్రార్థనలు ఘనంగా జరుపుకున్న అనంతరం ఫోరం తరపు శుభాకాంక్షలు తెలిపారు. ఈ పవిత్ర రంజాన్ మీకు అల్లా ఆశీర్వాదంతో సంతోషాలను తెచ్చి పెట్టాలని మీ ఇంట్లో సుఖశాంతులతో జీవించాలని మనసారా కోరుకుంటూ ముస్లిం సోదరసోదరీ మణులందరికి రంజాన్ శుభాకాంక్షలు తెలియజేశారు.

# శాంతిభద్రతలపై పోలీస్ అధికారులతో ఐజిపి సమీక్ష

## డ్రగ్స్‌పై ఉక్కుపాదం మోపాలి
## ఫ్రెండ్లీ పోలీస్ పోలీస్‌గా వ్యవహరించాలి





వాస్తవం : రాజన్న సిరిసిల్ల (ప్రతినిధి)

రాజన్న సిరిసిల్ల జిల్లా పోలీసు కార్యాలయంలో శనివారం జిల్లా పోలీస్ అధికారులతో మల్టీ జోన్ - ౹ ఐజీపీ చంద్రశేఖర్ రెడ్డి సమీక్షించారు.రాజన్న సిరిసిల్ల జిల్లాకు ఐజీపీ చంద్రశేఖర్ రెడ్డి రాగా జిల్లా పోలీస్ అధికారులు పూల మొక్కలు అందజేసి ఘనంగా స్వాగతం పలికారు.అనంతరం సాయుధ బలగాలచే గౌరవ వందనం స్వీకరించారు. పోలీస్ సర్కిల్ వారిగా శాంతి భద్రతల పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. ఎలాంటి సమస్యలు తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని, ప్రజలకు భద్రతాభావం కలిగేలా సమర్థవంతంగా విధులు నిర్వహించాలని సూచించారు.పోలీస్ అధికారులు, సిబ్బంది చట్టాలపై లోతైన అవగాహన పెంపొందించుకోవాలని, నమోదైన కేసులలో దర్యాప్తు నాణ్యతను మెరుగుపరుస్తూ ప్రజలకు వేగవంతమైన న్యాయం అందేలా పోలీస్ యంత్రాంగం మరింత సమర్థవంతంగా పనిచేయాలని తెలిపారు.అన్ని పోలీస్ స్టేషన్లలో 5 ఎస్ లో బాగంగా రికార్డుల నిర్వహణను సక్రమంగా ఉంచాలని,జిల్లాలో ప్రోయాక్టివ్, విజిబుల్, కమ్యూనిటీ పోలీసింగ్ పై దృష్టి సారించాలని,చట్ట వ్యతిరేక కార్యకలాపాలపై,గంజాయి వంటి మాదకద్రవ్యాలపై నిఘాను కఠినతరం చేయాలని ఆదేశించారు.ఇంటి నుండి బయటకు వెళ్లిన ప్రతి వ్యక్తి సురక్షితంగా ఇంటికి చేరే లక్ష్యంతో చేపట్టిన "అరైవ్ అలైవ్" కార్యక్రమాన్ని ప్రజల్లో విస్తృతంగా ప్రచారం చేయాలని,రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన "ప్రజాపాలన-ప్రగతి ప్రణాళిక"లో భాగంగా అన్ని శాఖల సమన్వయంతో ఈ కార్యక్రమాన్ని ముందుకు తీసుకెళ్లాలని తెలిపారు.ఈ సమావేశంలో జిల్లా అదనపు ఎస్పీ చంద్రయ్య, డిఎస్పీ నాగేంద్రచారి, సి.ఐ లు శ్రీనివాస్, నాగేశ్వరరావు, వెంకటేష్, వెంకటేశ్వర్లు,రవి, ఆర్ ఐ లు మధుకర్, రమేష్, యాదగిరి, సురేష్, పాల్గొన్నారు.

# చేనేత, పవర్ లూమ్ సమస్యల మహాధర్నాను విజయవంతం చేయండి

## పవర్ లూమ్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు మూషం రమేష్ పిలుపు
## వాల్ పోస్టర్, కరపత్రం ఆవిష్కరణ



వాస్తవం : సిరిసిల్ల

చేనేత, పవర్ లూమ్ సమస్యల పరిష్కారానికి ఈ నెల 25 న హైదరాబాద్ లో నిర్వహించే మహా ధర్నా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సిఐటియు చేనేత, పవర్ లూమ్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు మూషం రమేష్ పిలుపునిచ్చారు. సిఐటియు రాష్ట్ర సిరిసిల్ల పట్టణంలోని బివై నగర్ లోని కామ్రేడ్ అమృత్ లాల్ శుక్లా కార్మిక భవన్ సీఐటీయూ జిల్లా కార్యాలయంలో శనివారం తెలంగాణ పవర్ లూమ్ వర్కర్స్ యూనియన్ - చేనేత కార్మిక సంఘం ఆధ్వర్యంలో చేనేత - పవర్ లూమ్ సమస్యలపై ఈనెల 25 న హైదరాబాద్ ఇందిరాపార్క్ వద్ద చేపట్టనున్న మహా ధర్నా కార్యక్రమానికి సంబంధించిన వాల్ పోస్టర్ , కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా తెలంగాణ పవర్ లూమ్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు మూషం రమేష్ , జిల్లా అధ్యక్షులు కోడం రమణ లు మాట్లాడుతూ ....రాష్ట్రంలో చేనేత - పవర్ లూమ్ వస్త్ర పరిశ్రమల అభివృద్ధికి, కార్మికుల సంక్షేమానికి సంబంధించి వివిధ పథకాల అమలు కోసం ప్రభుత్వం బడ్జెట్ లో చేనేత రంగానికి 2 వేల కోట్ల రూపాయలు, పవర్ లూమ్ రంగానికి 2 వేల కోట్ల రూపాయలను కేటాయించాలని, చేనేత జౌళి శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావుకి, రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి మల్లు బట్టి విక్రమార్క కి కలిసి విన్నవించినప్పటికీ బడ్జెట్ లో కేవలం 258 కోట్ల రూపాయలు మాత్రమే కేటాయించి నేతన్నలకు అన్యాయం చేసిందన్నారు.పవర్ లూమ్ వస్త్ర పరిశ్రమ అభివృద్ధికి ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలు కావాలన్నా కార్మికులకు సంక్షేమ పథకాలు అమలు జరగాలన్న ప్రస్తుతం కేటాయించిన బడ్జెట్ ఏమాత్రం సరిపోదని, రాష్ట్ర అసెంబ్లీ సమావేశాలలో పవర్ లూమ్ రంగానికి బడ్జెట్ పెంచి కేటాయించాలని పలు డిమాండ్లతో ఈ నెల 25 న హైదరాబాద్ ఇందిరాపార్క్ వద్ద పెద్ద ఎత్తున మహా ధర్నా నిర్వహించడం జరుగుతుందని, ఈ మహాధర్నాలో రాష్ట్రం నలుమూలల నుండి చేనేత - పవర్ లూమ్ వస్త్ర పరిశ్రమలకు సంబంధించిన అన్ని విభాగాల వారు పెద్ద ఎత్తున హాజరై విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ పవర్ లూమ్ వర్కర్స్ జిల్లా నాయకులు సిరిమల్ల సత్యం, బెజుగం సురేష్, ఒగ్గు గణేష్, సందుపట్ల పోచమల్లు, తదితరులు పాల్గొన్నారు.

# రంజాన్ వేడుకల్లో మంత్రి వివేక్ వెంకటస్వామి

## ఇందారంలో పండుగ వాతావరణం



వాస్తవం : జైపూర్

రంజాన్ పండుగను పురస్కరించుకొని మండలంలోని ఇందారం గ్రామంలో పండుగ వాతావరణం నెలకొంది. రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి రంజాన్ వేడుకల్లో పాల్గొని ముస్లిం సోదరులకు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. గ్రామ సర్పంచ్ ఫయాజ్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా హాజరై ఏర్పాటు చేసిన అతీత్యాన్ని స్వీకరించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ చెన్నూరు నియోజకవర్గంలో గంగా--జమున తహజీబ్ సంప్రదాయం ప్రతిబింబిస్తోందని పేర్కొన్నారు. మత సామరస్యానికి ఈ ప్రాంతం ఆదర్శంగా నిలుస్తోందన్నారు. ముస్లిం సోదరులు రంజాన్ నెలలో పాటించే నియమాలు, ఉపవాస దీక్షలు మనసును శుద్ధి చేసుకునే గొప్ప ఆచారమని అభిప్రాయపడ్డారు. ప్రేమ, అనురాగాలు, మానవత్వం పరిపూర్ణంగా ఉన్నప్పుడే సమాజం సుభిక్షంగా ముందుకు సాగుతుందని మంత్రి అన్నారు. తెలంగాణ ప్రభుత్వం మైనార్టీల అభివృద్ధికి పెద్దపీట వేస్తోందని, వారి సంక్షేమం కోసం పలు పథకాలు అమలు చేస్తున్నామని తెలిపారు. ఇందారం గ్రామంలో నిర్వహించిన ఈ వేడుకల్లో ముస్లిం సోదరులు వందల సంఖ్యలో పాల్గొని ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం పరస్పరం శుభాకాంక్షలు తెలియజేసుకుంటూ పండుగ ఆనందాన్ని పంచుకున్నారు. స్థానిక ప్రజాప్రతినిధులు, గ్రామ పెద్దలు, యువత పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. జైపూర్ మండల కేంద్రం లోని ముస్లింలు స్థానిక మసీద్ లో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. రంజాన్ పండుగ సందర్భంగా ఎస్సై రాజశేఖర్ ఇందారం జైపూర్ లలో పోలీస్ బందోబస్త్ ఏర్పాటు చేశారు.

# రంజాన్ పండుగ శుభాకాంక్షలు తెలిపిన వంటేరు ప్రతాప్ రెడ్డి

## అల్లా ఆశీస్సులు అందరిపై ఉండాలని ఆకాంక్ష

## కేసీఆర్ హయాంలో మైనార్టీలకు పెద్దపీట



వాస్తవం : గజ్వేల్ ఆర్ సి

ఈద్-ఉల్-ఫితర్ సందర్భంగా గజ్వేల్ పట్టణంలోని ఈద్గా, ప్రజ్ఞాపూర్ ఈద్గా వద్ద ముస్లిం సోదరులను కలిసి బిఆర్ఎస్ పార్టీ గజ్వేల్ నియోజకవర్గ ఇంచార్జ్ వంటేరు ప్రతాప్ రెడ్డి రంజాన్ పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అల్లా ఆశీస్సులు ఎల్లప్పుడూ అందరిపై ఉండాలని కోరుకుంటూ, రంజాన్ పండుగ క్రమశిక్షణ, సేవా భావానికి ప్రతీకగా నిలుస్తుందని పేర్కొన్నారు. ప్రతి ఇంటికి శాంతి, సిరిసంపదలు, సంతోషాలు నిండాలని ఆకాంక్షించారు. ఈద్గాల్లో ముస్లింలు పెద్ద సంఖ్యలో పాల్గొని ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. గత కేసీఆర్ ప్రభుత్వంలో మైనార్టీల సంక్షేమానికి పెద్దపీట వేసినట్లు గుర్తు చేశారు. షాదీ ముబారక్ ద్వారా పేద కుటుంబాలకు అండగా నిలిచామని, ఇమామ్‌లు, ముజ్జిన్‌లకు గౌరవ వేతనాలు అందించినట్లు తెలిపారు. రంజాన్ తోఫాలు, ఇఫ్తార్ విందుల ద్వారా మైనార్టీలకు ప్రభుత్వం అండగా నిలిచిందన్నారు. తొమ్మిదేళ్ల పాలనలో దాదాపు 10 వేల కోట్ల రూపాయలతో మైనార్టీల సంక్షేమ కార్యక్రమాలు అమలు చేశామని, స్వయం ఉపాధి కోసం వేలాది మందికి శిక్షణ, వాహనాలు అందించామని పేర్కొన్నారు. 3310 మందికి విదేశీ విద్య కోసం స్కాలర్షిప్‌లు అందించామని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా మైనార్టీ గురుకులాలు, జూనియర్ కళాశాలల ద్వారా లక్షలాది విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించామని, గజ్వేల్ ప్రాంతంలో దాదాపు రూ.20 కోట్లతో మైనార్టీ సంక్షేమ కార్యక్రమాలు చేపట్టినట్లు వివరించారు. మదీనా మస్జిద్ వద్ద షాపింగ్ కాంప్లెక్స్, షాదీ ఖానా నిర్మాణం, ఈద్గాలకు స్థలాల కేటాయింపు, మహిళలకు 420 కుట్టుమిషన్ల పంపిణీ వంటి కార్యక్రమాలు అమలు చేశారని తెలిపారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం మైనార్టీల సంక్షేమాన్ని నిర్లక్ష్యం చేస్తోందని ఆరోపించారు. రంజాన్ తోఫాల పంపిణీలో పారదర్శకత లేకుండా వ్యవహరిస్తోందని, పేద ముస్లింలను విస్మరిస్తోందని మండిపడ్డారు. మైనార్టీలను కేవలం ఓటు బ్యాంకుగా మాత్రమే చూస్తోందని విమర్శించారు. ప్రభుత్వం ఇప్పటికైనా వైఖరి మార్చుకుని మైనార్టీలకు సమాన న్యాయం చేయాలని, వారి సంక్షేమానికి కట్టుబడి పనిచేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ గంగిశెట్టి చందన రవీందర్, వైస్ చైర్మన్ పద్మాబాయి నర్సింగరావు, రాష్ట్ర నాయకులు విరాసత్ అలీ, పట్టణ అధ్యక్షుడు నవాజ్ మీర్, మాజీ వైస్ చైర్మన్ జక్కియోద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

# అగ్ని ప్రమాదాలతో అడవులు, ప్లాంటేషన్లకు భారీ నష్టం

## టీజీఎఫ్‌డీసీ ప్లాంటేషన్ మేనేజర్

## సురేష్ కుమార్ హెచ్చరిక



వాస్తవం : జైపూర్

అగ్ని ప్రమాదాల వల్ల అడవులు, ప్లాంటేషన్లకు తీవ్ర నష్టం వాటిల్లుతుందని తెలంగాణ అటవీ అభివృద్ధి సంస్థ (టీజీఎఫ్‌డీసీ) మంచిర్యాల రేంజ్ ప్లాంటేషన్ మేనేజర్ గోగు సురేష్ కుమార్ తెలిపారు. ప్రపంచ అటవీ దినోత్సవాన్ని పురస్కరించుకొని శనివారం జైపూర్ మండలం ముదికుంట నీలగిరి ప్లాంటేషన్‌లో టీజీఎఫ్‌డీసీ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవికాలంలో మానవ నిర్లక్ష్యమే అడవుల్లో అగ్ని ప్రమాదాలకు ప్రధాన కారణమని పేర్కొన్నారు. బీడీలు, సిగరెట్లు కాల్చి నిర్లక్ష్యంగా పడేయడం వల్ల మంటలు చెలరేగే ప్రమాదం ఉందన్నారు. అలాగే వ్యక్తిగత ప్రయోజనాల కోసం అడవుల్లో నిప్పు పెట్టడం తీవ్రమైన నష్టం కలిగిస్తుందని హెచ్చరించారు. అగ్ని ప్రమాదాల కారణంగా చెట్లు ఎండిపోవడమే కాకుండా అనేక జీవరాసులు ప్రాణాలు కోల్పోతున్నాయని తెలిపారు. అడవులు పర్యావరణ పరిరక్షణకు, మానవాళి మనుగడకు కీలకమని, వాటిని కాపాడటం ప్రతి ఒక్కరి బాధ్యత అని అన్నారు. అటవీ శాఖ సిబ్బంది అడవులు, ప్లాంటేషన్ల రక్షణకు కృషి చేస్తున్న నేపథ్యంలో ప్రజలు కూడా తమ వంతు సహకారం అందించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో టీజీఎఫ్‌డీసీ సిబ్బంది రాజేష్, శంకర్, సంజీవ్ తదితరులు పాల్గొన్నారు.

# గుండెపోటుతో మున్సిపల్ కార్మికుడు మృతి

## జిహెచ్ఎంసి తరపున 20000 ఆర్థిక సాయం



వాస్తవం : రాజేంద్రనగర్

గుండెపోటుతో మున్సిపల్ కార్మికుడు మరణించిన ఘటన అత్తాపూర్ పరిధిలో జరిగింది. శుక్రవారం ఉదయం 9 గం టలకు అత్తాపూర్ సర్కిల్ హుడా కాలనీ ప్రాంతంలో పారి శుద్ధ్య కార్మికుడు కే. యాదయ్య (45) విధులు నిర్వహిస్తున్నాడు. అకస్మాత్తుగా అతనికి గుండెపోటు రావడంతో తోటి కార్మికులు స్థానికంగా ఉన్న హాస్పటల్ తరలించారు. చికిత్స పొందుతూ అతను మరణించాడు. విషయం తెలుసుకున్న తెలంగాణ మున్సిపల్ కాంట్రాక్ట్ ఔట్సోర్సింగ్ వర్కర్స్ యూనియన్ రంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి వనపల్లి జయపాల్ రెడ్డి ఆసుపత్రి వద్దకు చేరుకున్నారు. ఈ ఘటనపై మున్సిపల్ అధికారులు ఎవరు స్పందించకపోవడంతో శానిటేషన్ అడిషనల్ కమిషనర్ ఎన్. రవి కిరణ్ తో జైపాల్ రెడ్డి ఫోన్లో మాట్లాడారు. వెంటనే స్పందించిన అడిషనల్ కమిషనర్ అత్తాపూర్ సర్కిల్ డిసి సమ్మయ్య ను ఫోన్లో సంప్రదించారు. ఇందులో భాగంగా దహన సంస్కారాల నిమిత్తం మృతుని కుటుంబ సభ్యులకు 20 వేల రూపాయలను డిసి అందజేశారు. ఈ సందర్భంగా జయపాల్ రెడ్డి అధికారులకు ధన్యవాదాలు తెలిపారు. యాదయ్య ఆత్మకు శాంతి చేకూరాలని ఆయన కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు. అంత్యక్రియల నిమిత్తం కుటుంబ సభ్యులు యాదయ్య మృతదేహాన్ని మహబూబ్ నగర్ లోని వారి సొంత గ్రామానికి తీసుకెళ్లారు.

# రక్తదానానికి ముందుకు రావడం అభినందనీయం



## ప్రభుత్వ ఆసుపత్రి డాక్టర్ కృష్ణ

## రక్తదానం పట్ల ప్రజలల్లో అవగాహన పెంచాలి

## సీఐటీయూ రాష్ట్ర కమిటీ సభ్యుడు కె.రాజయ్య

వాస్తవం : సంగారెడ్డి

సంగారెడ్డి రక్తదానానికి ముందుకు రావడం అభినందనీయమని బ్లడ్ బ్యాంకు డాక్టర్ కృష్ణ అన్నారు. ప్రజానాట్యమండలి జిల్లా మహాసభల సందర్భంగా సంగారెడ్డిలోని జిల్లా ప్రభుత్వాసుపత్రిలో రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ కృష్ణ మాట్లాడుతూ రక్తదానానికి ముందుకు రావడం అభినందనీయమన్నారు. రక్తదానం చేయడం వల్ల ఆపదలో ఉన్న వారిని ఆదుకునేందుకు ఉపయోగపడుతుందని, ప్రాణాలను కాపాడే వీలు కలుగుతుందన్నారు. రక్తదానం పట్ల ప్రజల్లో అవగాహన పెంచాలి..సీఐటీయూ రాష్ట్ర కమిటీ సభ్యుడు కె.రాజయ్య రక్తదానం పట్ల ప్రజలకు అవగాహన కల్పించాలని సీఐటీయూ రాష్ట్ర కమిటీ సభ్యుడు కె.రాజయ్య అన్నారు. రక్తదానం చేయడం అంటే ప్రాణాలను కాపాడడమే అన్నారు. రక్త దానం చేసేందుకు ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని పిలుపునిచ్చారు. అత్యవసర పరిస్థితుల్లో ప్రజల ప్రాణాలు కాపాడినవారవుతారన్నారు. రక్తదానం చేయడం వల్ల బలహీనపడతామనే అపోహను నమ్మవద్దని సూచించారు. ఈ రక్తదానం శిబిరంలో ప్రజానాట్యమండలి అధ్యక్ష,కార్యదర్శులు పి.ఆంజనేయులు, ఏ.నాగభూషణం, జిల్లా నాయకులు దుర్గేష్, ఎన్. రాజు, దవులప్ప, ఎం. కృష్ణ, పద్మ, ప్రవీణ తదితరులు పాల్గొన్నారు.

# బీసీలకు అనుకూలించని బడ్జెట్

### అంకెల గారడిగా కాంగ్రెస్ బడ్జెట్

### మాజీ ఎమ్మెల్యే కాంతి కిరణ్



వాస్తవం : ఆందోల్

కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన వార్షిక బడ్జెట్ అంకెల గారడి గా ఉందని ఇది ఏ మాత్రం బీసీలకు.అనుకూలించకపోవడం విచారకరంగా ఉందని అందోల్ మాజీ శాసనసభ్యులు క్రాంతి కిరణ్ అన్నారు. శనివారం నాడు అందోల్ జోగిపేట మున్సిపల్ పరిధిలోని 13వ వార్డు కౌన్సిలర్ పట్లూరి శివ శేఖర్ స్వగృహంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన వార్షిక బడ్జెట్ పేద ప్రజలకు ఉపయోగపడేలా లేదని రాజకీయ నాయకుల జేబులు నింపుకునే లా ఉందని ఆయన విమర్శించారు. కెసిఆర్ పథకాలను కాంగ్రెస్ ప్రభుత్వం కాలరాస్తుందని తెలిపారు. కామారెడ్డి డెకరేషన్ లో బీసీలకు న్యాయం చేస్తామని తెలిపిన ప్రభుత్వం మూడు సంవత్సరాల గడిచిన బీసీ ల లను పెడ చెవిన పెట్టిందన్నారు. కెసిఆర్ కంటే ఎక్కువ ఇస్తామని తెలిపిన ప్రభుత్వం నేటికీఅమలు చేయలేకపోయింది అన్నారు. కామారెడ్డి డిక్లరేషన్ లో బీసీలకు 20,000 కోట్లు కేటాయిస్తామని చెప్పి బీసీలను మోసం చేసిందన్నారు . కళ్యాణ లక్ష్మిలో తులం బంగారం అన్నారు ,అది లేదు దళిత బందులో రెట్టింపు ఇస్తానన్నారు ,అది పూర్తిగా బంద్ చేశారు, ఇదేం ప్రభుత్వమని ఆయన ఎద్దేవా వేశారు. బసవేశ్వర సంగమేశ్వర ప్రాజెక్టుకు రూపాయి కేటాయించకపోవడం విచారకరమన్నారు. అసలు దాని ఊసేఎత్తడం లేదు అన్నారు. ఏం మాట్లాడినా మూసీ నది మూసినాదని, ప్రగల్ బాలు పలుకుతున్నారన్నారు. ఇవన్నీ దృష్టిలో పెట్టుకొని కాంగ్రెస్ నాయకు లను ఎక్కడికక్కడే నీలతీయాలని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమం లో మాజీ డిసిసిబి వైస్ చైర్మన్ జైపాల్ రెడ్డి , అందోల్జెడ్పిటిసి నారాయణ, ఆ వార్డ్ కౌన్సిలర్ పట్లూరి శివ శేఖర్, టిఆర్ఎస్ అధ్యక్షులు చాపల వెంకటేశం, సర్పంచ్ లుహరినారాయణ వర్మ, ప్రభు గారి వసంత రెడ్డి,పుల్కల్ పార్టీ అధ్యక్షులు మాచర్ల విజయకుమార్, టిఆర్ఎస్ నాయకులు బిర్లశంకర్, టిఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

# ఐజిపితో ఆది భేటీ



వాస్తవం : వేములవాడ

వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి అనుబంధ దేవాలయమైన భీమేశ్వర స్వామిని మల్టీ జోన్ ఐజీపీ చంద్రశేఖర్ రెడ్డి శనివారం వచ్చి దర్శించుకుని మొక్కులు సమర్పించారు.ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్‌తో మైత్రి అతిథి గృహంలో ఐ జి పి చంద్రశేఖర్ రెడ్డి భేటీ అయ్యారు.ఈ సందర్భంగా పలు అంశాలపై చర్చించారు.ప్రజా పాలన- ప్రగతి ప్రణాళిక 99 కార్యక్రమాలు, వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి అభివృద్ధి, పట్టణాభివృద్ధిపై చర్చించారు.

# చట్టపరమైన గుర్తింపుకు ఆహార భద్రతా నమోదు



### డిసి సమ్మయ్య

వాస్తవం : రాజేంద్రనగర్

సురక్షితమైన ఆహారం చట్టపరమైన గుర్తింపు కొరకు ఆహార పదార్థాలు అమ్మే చిరు వ్యాపారులు ఆహార భద్రతా నమోదు మేళా (ఎఫ్ ఎస్ ఎస్ ఏ ఐ) కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని అత్తాపూర్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ సమ్మయ్య తెలిపారు. సర్కిల్ కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఆహార పదార్థాలు అమ్మే చిరు వ్యాపారులు తమ వ్యాపార సంస్థల పేర్లను నమోదు చేసుకున్నారు. ఈ సందర్భంగా డిసి మాట్లాడుతూ... 99 రోజుల ప్రజాపాలన పట్టణ ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా శనివారం సర్కిల్ పరిధిలో ఈ కార్యక్రమాన్ని చేపట్టామన్నారు. ఈ రిజిస్ట్రేషన్ ల వల్ల వ్యాపారులకు చట్టపరమైన గుర్తింపు తో పాటు ప్రభుత్వ పథకాల లబ్ధి చేకూరుతుందని తెలిపారు. కార్యక్రమంలో ఫుడ్ సేఫ్టీ ఆఫీసర్ సౌమ్య రెడ్డి, జిహెచ్ఎంసి అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# యువత క్రీడా స్ఫూర్తితో ముందుకు సాగాలి






వాస్తవం : దౌల్తాబాద్

యువత క్రీడా స్ఫూర్తితో ముందుకు సాగాలని తొగుట మండల బి ఆర్ ఎస్ పార్టీ అధ్యక్షులు జీడిపల్లి రాంరెడ్డి పిలుపునిచ్చారు.. తొగుట మండలంలోని లింగాపూర్ లో బిఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి (కే పి ఆర్) టోర్నమెంట్ ను పార్టీ శ్రేణులతో కలిసి ఆయన ప్రారంభించారు.. ఈసందర్భంగా అయన మాట్లాడుతూ క్రీడలు కేవలం వినోదం కాదు అవి మనిషి వ్యక్తిత్వాన్ని తీర్చిదిద్దే గొప్ప విద్యాలయం అని పేర్కొన్నారు..ఈ మైదానంలో పడే ప్రతి చెమట చుక్క, భవిష్యత్తులో విజయానికి వేసే బలమైన పునాది గా భావించాలన్నారు. . గెలుపు ఒక్కటే లక్ష్యం కాకూడదు --- గెలిచే ధైర్యం, ఓడినప్పుడు మళ్లీ లేచి నిలబడే పట్టుదలే నిజమైన విజయమని గుర్తుంచుకోవాలన్నారు.ఈ టోర్నమెంట్ యువతలో నిద్రిస్తున్న ప్రతిభను వెలికితీసే వేదికగా మారాలని ఆకాంక్షించారు..ప్రతి ఆటగాడు క్రీడా స్ఫూర్తితో, నిజాయితీతో, క్రమశిక్షణతో ఆడి తమ గ్రామానికి, తన కుటుంబానికి గర్వకారణం కావాలన్నారు..మన గ్రామాల నుంచి రాష్ట్ర స్థాయి, దేశ స్థాయి క్రీడాకారులు వెలువడే రోజులు దూరంలో లేవని,యువత చెడు మార్గాలకు దూరంగా ఉండి, క్రీడలను జీవిత భాగంగా మార్చుకుంటే సమాజం మరింత బలంగా, ఆరోగ్యంగా మారుతుందన్నారు.అందరూ ఐక్యతతో, ఆనందంతో, క్రీడా స్ఫూర్తితో పాల్గొని ఈ టోర్నమెంట్‌ను ఘనవిజయంగా నిలపాలని ఆయన కోరుకున్నారు..రంగంపేట, కొనాపూర్ జట్ల మధ్య జరిగిన మ్యాచ్ లో రంగంపేట, వెంకట్రావుపేట, ఏటిగడ్డ కిష్టాపూర్ మధ్య జరిగిన మ్యాచ్ లో ఏటిగడ్డ కిష్టాపూర్ జట్టు విజయం సాధించింది..కార్యక్రమం లో సీనియర్ నాయకులు తగరం అశోక్, బిక్కునూరి శ్రీశైలం, కొత్తపల్లి సత్తయ్య, గ్రామ పార్టీ అధ్యక్షులు భూపాల్ రెడ్డి, బిక్కునూరి సంతోష్, జీడిపల్లి స్వామి, యాదగిరి, కే భాస్కర్, కొత్తపల్లి భాను, ఈశ్వర్, కుమార్, స్వామి, నరపతి, గణేష్, అనిల్ తదితరులు పాల్గొన్నారు..

# శ్రీరామనవమి వేడుకలకు ఘన ఏర్పాట్లు

### జిల్లా అధికారులతో రాజన్న ఈవో సమీక్ష



వాస్తవం : వేములవాడ

వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి శ్రీ భీమేశ్వర స్వామి ఆలయంలో జరగబోయే శ్రీరామనవమి ఉత్సవాల ఏర్పాట్లపై ఆలయ అధికారులు విస్తృతంగా ఏర్పాట్లు చేస్తున్నారు.శ్రీ పరాభవ నామ సంవత్సరం చైత్ర శుద్ధ పాఢ్యమి గురువారం నుండి చైత్ర శుద్ధ నవమి శుక్రవారం వరకు వసంత నవరాత్రోత్సవాలు ఏకాంతంగా నిర్వహించారు.ఈనెల 27న శ్రీ సీతారాముల కల్యాణోత్సవం ఆలయ పార్కింగ్ స్థలం వద్ద ఏర్పాటు చేసిన శివార్చన వేదికపై అత్యంత వైభవంగా నిర్వహించనున్నారు.అదే రోజు సాయంత్రం 5 గంటలకు రథోత్సవం నిర్వహించనున్నట్లు దేవస్థానం అధికారులు తెలిపారు. ఈ ఉత్సవాల్లో పాల్గొనే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లపై దేవస్థానం ముఖ్య కార్యనిర్వహణాధికారి ఎల్ రమాదేవి శనివారం శ్రీ భీమేశ్వర సదన్ మీటింగ్ హాల్ లో జిల్లా స్థాయి అన్ని శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. భక్తుల సౌకర్యార్థం ప్రత్యేకంగాక్యూలైన్లు చలివేంద్రాలు, పందిళ్లు త్రాగునీరు, మజ్జిగ పంపిణీ అన్నప్రసాదం పంపిణీ భారీ ప్రవేశ ద్వారాలు (గేట్లు) విద్యుత్ దీపాల అలంకరణ కూలర్లు కళ్యాణ వేదికను రంగురంగుల పూలతో అలంకరణతో పాటు హెల్త్ క్యాంపులు, ఫైర్ ఇంజిన్ సదుపాయం, ప్రత్యేక బస్సులు, సేవా సమితుల సహకారం, పారిశుద్ధ్య ఏర్పాట్లు, భద్రత కోసం పోలీసు బందోబస్తు వంటి ఏర్పాట్లు చేపట్టనున్నట్లు సమావేశంలో నిర్ణయించారు.ఈ సందర్భంగా ఆలయ ఈవో ఎల్ రమాదేవి మాట్లాడుతూ... శ్రీరామనవమి మహోత్సవంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని శ్రీ రాజరాజేశ్వర స్వామి వారి అనుగ్రహంతో పాటు శ్రీ సీతారాముల దివ్య ఆశీస్సులు పొందాలని కోరారు.

# కాటారంలో ఘనంగా లలితా సహస్రనామ పారాయణం

వాస్తవం : కాటారం

కాటారం మండల కేంద్రంలోని అయ్యప్పస్వామి దేవాలయం లో బ్రహ్మర్షి పితామహ పత్రీజీ ఆశీస్సులతో జ్ఞానదాత బ్రహ్మ విద్వరిష్ట శ్రీమతి జక్కా పద్మ ఆధ్వర్యంలో ధ్యాన జ్ఞాన శిక్షణ మరియు లలితా సహస్రనామ పారాయణం కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పిరమిడ్ సేవాదళ్ జిల్లా అధ్యక్షులు అనంతుల రమేష్ బాబు అధ్యక్షత వహించగా, పిరమిడ్ సొసైటీ జిల్లా అధ్యక్షుడు గడ్డం రామకృష్ణ ఆధ్వర్యంలో కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా జక్కా పద్మ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ధ్యానాన్ని రోజువారీ జీవితంలో భాగం చేసుకోవాలని సూచించారు. లలితా సహస్రనామ పారాయణం గొప్పతనాన్ని వివరించుతూ “పరా” అనగా శక్తి, “యానం” అనగా ఆత్మ అని, లలితా దేవి శక్తిని తెలుసుకోవడమే ఈ పారాయణం లక్ష్యమని తెలిపారు. అమ్మవారు ఎక్కడో బయట కాకుండా మనలోపలే ఉన్నారని, మానవుడు మాధవుడిని బయట వెతుకుతున్నప్పటికీ నిజానికి మాధవుడు మనలోనే ఉన్నాడని ఆత్మబోధ చేశారు. అంతరంగంలోని దైవత్వాన్ని తెలుసుకోవాలంటే ధ్యానం అత్యంత అవసరమని, శ్వాసపై ధ్యాస ఉంచి ధ్యానం చేస్తే సర్వరోగాలు తొలగి సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని చెప్పారు. అనంతరం ఆర్యవైశ్య సంఘం మరియు దాతల సహకారంతో ధ్యాన ప్రసాద వితరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పెద్దపల్లి జిల్లా అధ్యక్షురాలు సరోజమ్మ, మంథని పట్టణ పిరమిడ్ సొసైటీ నిర్వాహకులు సునీత విజయ్ కుమార్, జయశంకర్ భూపాలపల్లి జిల్లాలోని పిరమిడ్ మాస్టర్లు, అలాగే మహాదేవపూర్, మహాముత్తారం, కాటారం, తాడిచర్ల మండలాల నుంచి పెద్ద సంఖ్యలో ధ్యానులు, మహిళలు పాల్గొన్నారు. మొత్తం సుమారు 300 మంది హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.



# రంజాన్ వేడుకలలో పాల్గొన్న తోకల శ్రీనివాస్ రెడ్డి



వాస్తవం : రాజేంద్రనగర్

రాజేంద్రనగర్ నియోజకవర్గం మైలార్ దేవ్ పల్లి డివిజన్ పరిధిలోని మైనార్టీ మోర్చా డివిజన్ అధ్యక్షుడు మదర్ నిర్వహించిన రంజాన్ వేడుకలలో బిజెపి పార్టీ నియోజకవర్గ ఇన్చార్జి తోకల శ్రీనివాసరెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మైనార్టీ మోర్చా నాయకులకు, కార్యకర్తలకు ముస్లిం సోదరులకు రంజాన్ పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మైనార్టీ మోర్చా నాయకులు జబ్బార్, సీనియర్ నాయకులు రావుల భాస్కర్, అడికే జనార్ధన్, ప్రభుదాస్, మహమ్మద్ శౌల్, శ్రీకాంత్ రెడ్డి, అబూత్, జుబేర్ ఖాన్, ముస్తఫా, మధుసూదన్ రెడ్డి, శంకర్ రెడ్డి, సచిన్ తదితరులు పాల్గొన్నారు.

# బడ్జెట్‌లో గీత కార్మికులకు మొండి చేయి

## రాష్ట్ర గౌడ సంఘం మోకు దెబ్బ వర్కింగ్ ప్రెసిడెంట్ బుర్ర శ్రీనివాస్ గౌడ్

వాస్తవం : హుస్నాబాద్

రాష్ట్ర ప్రభుత్వం శుక్రవారం ప్రవేశపెట్టిన రాష్ట్ర బడ్జెట్ లో గీత కార్పొరేషన్ కు నిధులు కేటాయింపులో తీరని అన్యాయం జరగడంతో పాటు మొండి చేయి చూపించిందని, గీత కార్మికుల పట్ల ప్రభుత్వం వివక్ష చూపుతుందని రాష్ట్ర గౌడ సంఘం మోకు దెబ్బ వర్కింగ్ ప్రెసిడెంట్ బుర్ర శ్రీనివాస్ గౌడ్ ఆరోపించారు. శనివారం ఈ సందర్భంగా మాట్లాడుతూ... రాష్ట్రంలో గీత కార్మికులకు కార్పొరేషన్ ఉన్నప్పటికీ చైర్మన్ లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని, బడ్జెట్ లో సరియైన నిధులు కేటాయించకపోవడంతో ఆర్థికంగా ఎలాంటి పరిహారం అందించడం లేదని ప్రభుత్వాన్ని విమర్శించారు. ప్రభుత్వం గీత కార్మికులకు చెల్లించే ఎక్స్ గ్రేషియా చెల్లింపులో జాప్యం చేస్తూ, వృద్ధాప్య పింఛన్లు ఇవ్వడంలో కూడా మొండిచేయిని చూపిస్తూ గీత కార్మికులు ప్రమాదవశాత్తు తాటి చెట్టు పై నుండి పడి గాయాల పాలైన మరియు మరణించిన ప్రభుత్వ ఆసుపత్రికి వెళితే వారికి సర్టిఫికెట్ ఇవ్వలేని దుస్థితి ఈ రాష్ట్రంలో ఏర్పడిందని అన్నారు. సిద్దిపేట జిల్లాలో ప్రభుత్వ ఆసుపత్రిలో రాష్ట్రంలో ఎక్కడి లేని విధంగా హెల్త్ క్యాంప్ పేరిట కార్మికులను ఇబ్బందులకు గురి చేస్తూ సర్టిఫికెట్లు జారీ చేయడంలో వివక్ష చూపుతున్నారని ఆరోపించారు. వెంటనే సిద్దిపేటలో ఉన్నటువంటి హెల్త్ క్యాంప్ ని ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం గీత కార్మికుల పట్ల ఇంత వివక్ష చూపడంలో అంతర్యం ఏమిటని ప్రశ్నించారు.



గీత కార్మికులకు గుర్తింపు కార్డులు కావాలంటే ఎక్సైజ్ కార్యాలయాల చుట్టూ తిరిగిన ఫలితం లేకుండా పోతుందని గీత కార్మికుల జీవనోపాధి అయిన తాటి చెట్లు, ఈత చెట్లను నరికి వేసినా, దగ్ధం చేసినా కూడా అధికారులు పట్టించుకోవడంలేదని ఆవేదన వ్యక్తం చేశారు. గీత కార్మికులు ఎన్నో సమస్యలు ఎదుర్కొంటున్నారని వారి సమస్యలను చెప్పుకుందాం అంటే కార్పొరేషన్ కు చైర్మన్ లేక ఇబ్బందులకు గురికావాల్సి వస్తుందని ప్రభుత్వం వెంటనే స్పందించి కార్పొరేషన్ కు రూ.1000 కోట్లు ప్రత్యేక నిధులు కేటాయిస్తూ చైర్మన్ ను నియమించాలని కార్మికులకు రావాల్సిన బకాయిలను విడుదల చేయాలని, స్థానిక ఎమ్మెల్యే మంత్రి పొన్నం ప్రభాకర్ చొరవ తీసుకుని హుస్నాబాద్ పట్టణంలో గౌడ కమ్యూనిటీ హాల్ మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. కమ్యూనిటీ హాల్ పై ఎన్నోసార్లు మంత్రికి విన్నవించిన ఫలితం లేకుండా పోయిందని, ప్రభుత్వ పరంగా గీత కార్మికులను అన్ని విధాలుగా ఆదుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో గౌడ సంఘం రాష్ట్ర నాయకులు బుర్ర వెంకన్న గౌడ్, పరకాల శ్యాంసుందర్ గౌడ్, బుర్ర జగన్ గౌడ్, గోపగోని అరవింద్ గౌడ్, శ్రీనివాస్, అశోక్ లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

# మా అనాథ వృద్ధాశ్రమంలో వృద్ధులకు పండ్లు బ్రెడ్లు పంపిణీ



## కొత్తపల్లి గ్రామంలో సిమెంట్ బెంచీల వితరణ మోకు దెబ్బ జిల్లా అధ్యక్షుడు లచ్చులాగారి శ్రీనివాస్ గౌడ్

వాస్తవం : గంభీరావుపేట

గంభీరావుపేట మండలం కొత్తపల్లి గ్రామానికి చెందిన సిరిసిల్ల జిల్లా మోకు దెబ్బ గౌడ సంఘం జిల్లా అధ్యక్షులు లచ్చులాగారి శ్రీనివాస్ గౌడ్ జన్మదిన పురస్కరించుకొని శనివారం రోజున గంభీరావుపేట మండల కేంద్రంలోని మా అనాథ వృద్ధ ఆశ్రమంలో వృద్ధులకు పండ్లు బ్రెడ్లు పంపిణీ చేశారు. కొత్తపల్లి గ్రామంలోని వివిధ దేవాలయాల వద్ద బస్టాండ్ వద్ద ఎనిమిది సిమెంటు కుర్చీలను సమకూర్చారు. ఈకార్యక్రమంలో బిజెపి జిల్లా బీ జే వై ఎం ఉపాధ్యక్షుడు పెద్దూరి ప్రశాంత్ గౌడ్‌తో పాటు పలువురు గౌడ సంఘసభ్యులు పాల్గొన్నారు.

# శేరిలింగంపల్లిలో ఘనంగా రంజాన్ వేడుకలు

## ముస్లిం సోదరులకు శుభాకాంక్షలు తెలిపిన కాంగ్రెస్ నేత అనిల్ కుమార్ యాదవ్

వాస్తవం : శేరిలింగంపల్లి

రంజాన్ పవిత్ర పండుగను పురస్కరించుకొని శేరిలింగంపల్లి నియోజకవర్గంలోని పలు డివిజన్లలో ముస్లిం సోదరులకు ఈద్ ముబారక్ శుభాకాంక్షలు తెలియజేశారు కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు అనిల్ కుమార్ యాదవ్. శనివారం నియోజకవర్గంలోని వివిధ ప్రాంతాల్లో పర్యటించిన ఆయన, ముస్లిం సోదరుల ఇళ్లకు స్వయంగా వెళ్లి పండుగ శుభాకాంక్షలు అందజేశారు. ఈ సందర్భంగా అనిల్ కుమార్ యాదవ్ మాట్లాడుతూ.. “రంజాన్ పండుగ క్రమశిక్షణకు, దాతృత్వానికి మరియు సోదరభావానికి ప్రతీక అని, నియోజకవర్గంలోని ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలని ఆకాంక్షిస్తున్నాను” అని పేర్కొన్నారు. ముస్లిం సోదరులు ఆయనను సాదరంగా ఆహ్వానించి, పండుగ ఆనందాన్ని పంచుకున్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక కాంగ్రెస్ నాయకులు మరియు కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



## ఎమ్మెల్యే వి.నవీన్ యాదవ్‌ని మర్యాదపూర్వకంగా కలిసిన అధ్యక్షుడు షేక్ జాఫర్



వాస్తవం : జూబ్లీహిల్స్

ఈద్-ఉల్-ఫితర్( రంజాన్) పండుగ సందర్భంగా జూబ్లీహిల్స్ నియోజకవర్గ ఎమ్మెల్యే వి. నవీన్ యాదవ్ ని శనివారం మర్యాదపూర్వకంగా కలిశారు ఎంఐఎం పార్టీ శ్రీనగర్ కాలనీ( జూబ్లీహిల్స్ నియోజకవర్గం) శాఖ అధ్యక్షుడు షేక్ జాఫర్. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వి.నవీన్ యాదవ్ ని శాలువాతో ఘనంగా సన్మానించారు షేక్ జాఫర్. రంజాన్ పండుగ శుభాకాంక్షలు షేక్ జాఫర్‌కి తెలిపారు వి.నవీన్ యాదవ్. ఒకరినొకరు ఆలింగనం చేసుకొని శుభాకాంక్షలు తెలుపుకున్నారు.

# భక్తిశ్రద్ధలతో రంజాన్ వేడుకలు

### ఈద్గా ల్లో ప్రత్యేక ప్రార్థనలు
### ప్రజా ప్రతినిధులు, రాజకీయపక్ష నాయకులు ఒకరికినోకరు అలయ్ బలయ్





**వాస్తవం : రాజన్న సిరిసిల్ల ప్రతినిధి**

రాజన్న సిరిసిల్ల జిల్లాలో పవిత్ర రంజాన్ వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు. సిరిసిల్ల, వేములవాడ పట్టణాలతో పాటు మండల కేంద్రాల్లో, గ్రామ గ్రామాన ముస్లిం సోదరులు భక్తిశ్రద్ధలతో ఈద్గా ల్లో ప్రత్యేక ప్రార్థన నిర్వహించారు. రంజాన్ పవిత్ర పండుగ సందర్భంగా చిన్న పెద్ద కొత్త బట్టలతో ఈద్గా ల్లో ప్రత్యేక ప్రార్థన నిర్వహించారు. వేములవాడ రంజాన్ వేడుకల సందర్భంగా ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్, వేములవాడ మున్సిపల్ చైర్మన్ పుల్కం రాజు, కౌన్సిలర్ లు, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ లు, సిరిసిల్ల పట్టణంలో మున్సిపల్ చైర్మన్ జిందం కళ-చక్రపాణి, కౌన్సిలర్‌లు, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ లు, రాజకీయపక్ష నాయకులు ముస్లిం సోదరులకు రంజాన్ శుభాకాంక్షలు తెలుపుతూ అలయ్..బలయ్ లతో ఆలింగనం చేసుకున్నారు. స్వీట్లు ఒకరినొకరు పంచుకున్నారు. రంజాన్ పండుగ సందర్భంగా మున్సిపల్ పాలకవర్గాలు, గ్రామపంచాయతీ పాలన వర్గాలు ప్రత్యేక ఏర్పాటు చేశారు. సిరిసిల్ల, వేములవాడ సబ్ డివిజన్ పోలీస్ అధికారుల ఆధ్వర్యంలో పోలీస్ సిఐ, ఎస్ఐ లతో ప్రత్యేక బందోబస్తు ఏర్పాటు చేశారు. ఈద్- ఉల్- ఫీథర్ పవిత్ర రంజాన్ మాసంలో ముస్లిం సోదరులు ఉపవాసాలు పాటించి రంజాన్ పండుగ ప్రత్యేక ప్రార్థన ఉపసంహరించారు.కుల, మత, మతసామర స్యానికి ప్రతీకమైన రంజాన్ పండుగలో ప్రతి ఒక్కరు శుభాకాంక్షలు తెలుపుకున్నారు. రంజాన్ పండగ ప్రశాంతంగా ముగిసింది.

# హామీలు ఇచ్చి ఆచరణలో మరిచారు



**వాస్తవం : హుస్నాబాద్**

రెడ్డి కార్పొరేషన్ కు నిధులు కేటాయిస్తామని హామీ ఇచ్చి, ఆచరణలో మాత్రం కాంగ్రెస్ ప్రభుత్వం మొండి వైఖరి అవలంబించిందని బీఆర్ఎస్ నాయకులు మల్లికార్జున్ రెడ్డి ఆరోపించారు. అసెంబ్లీ ఎన్నికల్లో ఇచ్చిన మాటను నిలబెట్టుకోలేక, రెడ్ల ఓట్లే కావాలి తప్ప రెడ్డిలకు చేసింది ఏమీ లేదని విమర్శించారు. బహిరంగ సభలో సీఎం రేవంత్ రెడ్డి పార్టీ అధికారంలోకి వస్తే రెడ్లను ఆదుకుంటాం అని రెడ్డి కార్పొరేషన్ ఏర్పాటు చేస్తామని ప్రగల్భాలు పలికి, ప్రసంగాలు చేసి ఒరగబెట్టింది ఏమీ లేదన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి రెండున్నర సంవత్సరాలు అయినా కూడా రెడ్లను మరిచిందన్నారు. ఇప్పటికైనా కాంగ్రెస్ ప్రభుత్వం రెడ్డి కార్పొరేషన్ ఏర్పాటు చేసి వెంటనే నిధుల కేటాయింపులు చేయాలని ఈ సందర్భంగా కోరారు. లేనిచో రానున్న రోజుల్లో రెడ్డి కార్పొరేషన్ ఏర్పాటు కోసం రెడ్డి పక్షాన పోరాటం చేస్తామన్నారు.



# బాక్స్ కేఫ్‌లో ఘనంగా రంజాన్ వేడుకలు

**వాస్తవం : తిరుమలగిరి**

తిరుమలగిరి మండలకేంద్రంలో ఎండి ఉస్మాన్ ఖాన్ ఆధ్వర్యంలో బాక్స్ కేఫ్‌లో ముస్లిం సంప్రదాయం ప్రకారం బంధుమిత్రులకు సేమ్యా పంపిణీ చేసారు. ఈ సందర్భంగా హిందూ ముస్లిం భాయి భాయి అంటూ మతసామరస్యాన్ని చాటి చెప్పారు. ఇలాగే అన్ని పండుగలు కలిసిమెలిసి జరుపుకోవాలని కోరారు. ఈ కార్యక్రమం లో వినియోగదారుల ఫోరమ్ మండల అధ్యక్షులు చోల్లేటి రాములు, రిపోర్టర్లు నీర్మాల బాలకృష్ణ, బాకీ శ్రీనివాస్, ఊడుగు సుధాకర్, రిటైర్డ్ టీచర్ ఉపేందర్ రావు,రియల్ ఎస్టేట్ వ్యాపారులు నాగుల వెంకన్న, కళ్ళేట్లపల్లి చిన ఉప్పలయ్య, రాములు,అక్యుప్రెషర్ థెరపిస్ట్ పోత రాజు యాదగిరి,కుక్కల సోమేశ్, రమేష్‌లు పాల్గొన్నారు.

# మానవాళి మనుగడకు అడవులే ఆధారం

**-ఎఫ్ఆర్ఓ కల్పన దేవి**
**-వీర్నపల్లిలో ప్రపంచ అటవీ దినోత్సవం**



**వాస్తవం :వీర్నపల్లి :** మండల కేంద్రంలో ప్రపంచ అటవీ దినోత్సవం సందర్భంగా గ్రామపంచాయితీ ఆధ్వర్యంలో సర్పంచ్ మల్లారపు జ్యోత్స-అరుణ్ కుమార్ అధ్యక్షతన ప్రపంచ అటవీ దినోత్సవం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎఫ్ఆర్ఓ కల్పన దేవి హాజరైనారు, ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అటవీని కాపాడుకుంటేనే మనవా జాతికి మనగాడా ఉంటుందని అన్నారు.అటవీని నాశనం చెయ్యదని అన్నారు,అటవీని అంతం చేస్తే వన్యప్రాణులు కనుమరుగు అవుతున్నాయని అన్నారు, పర్యావరణ కాలుష్యంతో అనారోగ్యలకు పాలు అవుతాం అన్నారు. అటవీకి కారుచిచ్చు అంటిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని అన్నారు. అనంతరం ఉపాధి హామీ కూ లీలతో కలిసి కేక్ కట్ చేశారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ జక్కుల నరేష్, వార్డు సభ్యులు పద్మయ్య, సంజీవ్, దేవ లక్షినారాయణ,లావణ్య నాగరాజు,బిట్ ఆఫీసర్ కిరణ్,సతీష్, శ్రీకాంత్,తిరుపతి నాయక్ తదితరులు పాల్గొన్నారు.

# కరీంనగర్ టూటౌన్ ఎస్ఐ ఆత్మహత్య

**భార్య మృతిని తట్టుకోలేకే**
**ఐదు రోజుల వ్యవధిలోనే**
**భార్యాభర్తల బలవన్మరణం**
**అనాథలైన ఇద్దరు కుమారులు**
**సీతంపేట గ్రామంలో విషాదం**



**ఇల్లందకుంట, మార్చి 21 :**

భార్య మరణాన్ని తట్టుకోలేక కరీంనగర్ టూ టౌన్ ఎస్ఐ చంద్రశేఖర్ ఆత్మహత్య చేసుకున్నారు. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. చంద్రశేఖర్‌ది జయ శంకర్‌భూపాలపల్లి. పదేండ్ల క్రితం కరీంనగర్ జిల్లా ఇల్లందకుంట మండలం సీతంపేటకు చెందిన దివ్యను వివాహం చేసుకున్నాడు. వీరికి అశ్వథ, అభిమన్యు ఇద్దరు కుమారులు. ఐదు రోజుల క్రితం దివ్య ఆత్మహత్యకు పాల్పడింది. దివ్య మృతదేహాన్ని సీతంపేటకు తీసుకురాగా.. చంద్రశేఖర్ వేధింపులతోనే ఆమె ఆత్మహత్య చేసుకున్నదని గ్రామస్తులు ఆందోళన చేశారు. తన కూతురు కడుపునొప్పి భరించలేక ఆత్మహత్య చేసుకున్నదని దివ్య తండ్రి సమ్మయ్య పోలీసులకు ఫిర్యాదు చేయడంతో ఆందోళనకు తెరపడింది.భార్య అంత్యక్రియలు జరిగినప్పటి నుంచి ఎస్ఐ చంద్రశేఖర్ అత్తవారి ఇంట్లోనే ఉంటున్నాడు. శనివారం ఐదో రోజు కార్యక్రమంలో భాగంగా పక్షికి పెట్టి ఇంటికి తిరిగివచ్చాడు. అనంతరం గదిలోకి వెళ్లి భార్య చీరతో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. భార్య మృతితో తన కొడుకు తీవ్ర మనస్తాపం చెంది ఆత్మహత్య చేసుకున్నాడని చంద్రశేఖర్ తండ్రి మల్లయ్య ఫిర్యాదు చేసినట్టు ఏసీపీ మాధవి పేర్కొన్నారు. మృతదే హాన్ని జమ్మికుంట దవాఖానకు తర లించినట్టు తెలిపారు. భార్య అంత్యక్రియలు జరిగిన సీతంపేటకు చంద్రశేఖర్ మృతదేహాన్ని తరలించి దహన సంస్కారాలు నిర్వహించారు. తల్లి దండ్రుల మృతితో పిల్లలు అనాథలయ్యారు.

## జీవనరెడ్డి రాజీనామాకు
# ముహూర్తం ఫిక్స్..

కాంగ్రెస్ పార్టీకి మాజీ మంత్రి జీవన రెడ్డి రాజీనామా ముహూర్తం దాదాపుగా ఖరారైనట్లు తెలుస్తోంది. ఈనెల 25వ తేదీన అనుచరులతో కలిసి జీవనరెడ్డి రాజీనామా చేయనున్నట్లు సమాచారం. ఈ క్రమంలోనే జిల్లా కేంద్రం లోని ఓ గార్డెనలో జిల్లాకు చెందిన పలు నియోజకవర్గ నాయకులు, కార్యకర్తలతో చర్చించినట్లు ప్రచారం ఉంది. మూకుమ్మడిగా పార్టీకి, పార్టీ పదవులకు రాజీనామాలు చేయనున్నట్లు తెలుస్తోంది. అనుచరులు, కార్యకర్తల తో మరోమారు చర్చించిన అనంతరం భవిష్యత్తు కార్యాచరణపై ప్రకటన చేసే అవకాశం ఉందని జీవనరెడ్డి వర్గాలు అంటున్నాయి. రాజీనామా కార్యక్రమం నిర్వహించడానికి ఇప్పటికే జగిత్యాలలో ఓ పంక్షన హాల్ బుక్ చేసినట్లు ప్రచారం జరుగుతోంది. దేవుడు శాసించాడు..మానవుడు అనుసరిస్తాడంటూ..కార్యకర్తలంతా రెడీగా ఉండాలని జీవనరెడ్డి సూచించారు. ఈ నేపథ్యంలో జీవన రెడ్డి పార్టీ రాజీనామాకు సిద్ధపడినట్టు తెలుస్తోంది. జీవన రెడ్డి నిర్ణయంపై జగిత్యాలలో ఉత్కంఠ నెలకొంది.

వివిధ రంగాల్లో ప్రముఖులుగా చెలామణి అవుతున్న వారు తమ నోటిని అదుపులో ఉంచుకోవాల్సిన బాధ్యత ఎంతైనా ఉంది.వేదిక దొరికి మైకు అందితే హద్దు మీరి ప్రసంగాలు..సిగ్గుపడేలా పొగడ్తలు చేయడాలు మానుకోవాలి.హుందాగా విషయం మీద మాట్లాడితే ప్రజల్లో తమ హెూదాలు,పదవులకు గౌరవం నిలుస్తుంది.అది మరచి అనవసర ప్రసంగాలు చేస్తే జనం ఛీకొడతారు.తమ కులం వాడు వీరుడు..శూరుడు..అమెరికాకు ప్రెసిండెంట్ అవుతాడని అధిక ప్రసంగాలు చేసే నాయకులను చూశాం.ఆ ప్రసంగాలను అహెూ..ఒహెూ బ్రహ్మాండం అంటూ ఊదరగొట్టే భజన మీడియాలను చూశాం.

# మైకు దొరికితే అదుపుతప్పుతం

## »అనవసర ప్రసంగాలు..ఆకాశానికెత్తే పొగడ్తలు



కె.ఆర్ ఉన్నమాట

ప్రముఖుల పేరుతో కొందరు చేస్తున్న అతి ప్రసంగాలు వివాదాలకు తావిస్తున్నాయి.వివిధ రకాల వేదికల మీద సినీ ప్రముఖులు,రాజకీయ నేతలు,ఇతర రాజ్యాంగ హెూదాల్లో ఉన్నవారు, వివిధరంగాల్లోని ప్రముఖులు విచక్షణత కోల్పోయి వివాదాస్పద వ్యాఖ్యలు చేస్తున్నారు. వేదిక దొరికి మైకు అందితే రెచ్చిపోతు న్నారు.నవ్విపోదురుగాక మాకేంటి అనే తరహాలో పొగడ్తలతో ఆకాశానికె త్తుతారు..సందర్భం లేకుండా విమర్శలు చేస్తుంటారు. అనంతరం నలువైపుల నుంచి విమర్శలు రాగానే మాకు అలాంటి ఉద్దేశ్యం లేదు..నేను కావాలని అలా అనలేదు..నన్ను క్షమించండంటూ ఓ వీడియో తీసి చేతులు దులుపుకుంటున్నారు.

❍సందర్భం లేని వ్యాఖ్యలు చేయడం.. ఆనక నాలుక కరుచుకోవడం

❍ప్రముఖుల పేరుతో చెలామణిలో ఉన్న కొందరి చేష్టలు విమర్శలపాలు

❍పిల్లల తిండిపై గరికపాటి సంచలన వ్యాఖ్యలు..

❍సోషల్ మీడియాలో నెటిజన్ల ఫైర్

❍నేడు గరికపాటి..రేపు ఇంకెవరో?

❍అదుపులేని రోతలు..చేతలు

తాజాగా ప్రముఖ ప్రవచనకర్త గరికపాటి నరసింహారావు ప్రభుత్వ పాఠశాలల్లో అమలు చేస్తున్న మధ్యాహ్న భోజన పథకంపై చేసిన వివాదాస్పద వ్యాఖ్యలు ప్రస్తుతం తెలుగు రాష్ట్రాల్లో పెను దుమారాన్ని రేపుతున్నాయి. ఒక ప్రసంగం సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు ఉచితంగా భోజనం పెట్టడం, పుస్తకాలు, బట్టలు ఇవ్వడాన్ని తీవ్రంగా తప్పుబట్టారు. ఈ క్రమంలో ఆయన పాఠశాలకు వచ్చే పిల్లలను "శోభనపు పెళ్ళికొడుకులతో" పోల్చడం తీవ్ర విమర్శలకు దారితీసింది. విద్యార్థులు చదువు కోసం కాకుండా కేవలం ఉచిత భోజనం కోసమే బడికి వస్తున్నారనే అర్థం వచ్చేలా ఆయన మాట్లాడటంపై నెటిజన్లు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

ప్రముఖుల పేరుతో కొందరు చేస్తున్న అతి ప్రసంగాలు వివాదాలకు తావిస్తున్నాయి.వివిధ రకాల వేదికల మీద సినీ ప్రముఖులు,రాజకీయ నేతలు,ఇతర రాజ్యాంగ హెూదాల్లో ఉన్నవారు, వివిధరంగాల్లోని ప్రముఖులు విచక్షణత కోల్పోయి వివాదాస్పద వ్యాఖ్యలు చేస్తున్నారు. వేదిక దొరికి మైకు అందితే రెచ్చిపోతున్నారు. నవ్విపోదురుగాక మాకేంటి అనే తరహాలో పొగడ్తలతో ఆకాశానికెత్తుతారు..సందర్భం లేకుండా విమర్శలు చేస్తుంటారు.అనంతరం నలువైపుల నుంచి విమర్శలు రాగానే మాకు అలాంటి ఉద్దేశ్యం లేదు..నేను కావాలని అలా అనలేదు..నన్ను క్షమించండంటూ ఓ వీడియో తీసి చేతులు దులుపుకుంటున్నారు.అమ్మాయి కన్పిస్తే ముద్దయినా పెట్టాలి..లేదంటే ఇంకేదో చేయాలని సినీ నటుడు బాలకృష్ణ బహిరంగంగా తప్పుడు వ్యాఖ్యలు చేసిన సంగతి తెల్సిందే. సాటి నటుడు ఆలీని అనరాని బూతుతో బహిరంగంగా సంభోదిస్తే అంతా ఇకిలించడం చూశాం.వేదికలు దొరికితే రెచ్చిపోయే నటుడు రాజేంద్ర ప్రసాద్ ఇటీవలే తమిళ రాజకీయ,సినీ ప్రముఖులు ఎంజీఆర్‌పై నోటి దురుసు చూపి ఆనక తప్పయిందంటూ వీడియో రిలీజ్ చేయడం తెల్సిందే.ఇక వారం రోజుల క్రితం దేశ అతున్నత న్యాయస్థానం సుప్రీం కోర్టు మాజీ చీఫ్ జస్టిస్‌గా పనిచేసిన జస్టిస్ ఎన్వీ రమణ తెలుగుదేశం పార్టీ కార్యక్రమంలో పాల్గొని అక్కడి నాయకుడికి ఏదో పదవి ఇవ్వాలని ఏపీ సీఎం చంద్రబాబుకు సలహాలివ్వడం వివాదాస్పదంగా మారింది.దేశ అత్యున్నత రాజ్యాంగ పదవిని అధిరోహించిన వారు పదవిలో ఉన్నప్పుడు..పదవీ విరమణ అనంతరం కూడా తాము చేపట్టిన పదవికి హెూదాని, గౌరవాన్ని కాపాడాల్సిన బాధ్యత వారిపై ఉంటుంది.ఈ బాధ్యతను మరచిన జస్టిస్ రమణ పలు వేదికల మీద చేస్తున్న వ్యాఖ్యలు పూర్తిగా ఓ రాజకీయ పార్టీ కార్యకర్త చేస్తున్నట్లుగా ఉండటం పలు విమర్శలకు తావిస్తోంది. అదేవిధంగా తెలంగాణ రాష్ట్రానికి చెందిన తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామ్యేల్ బ్రాహ్మణుల మీద చేసిన పనికిమాలిన వ్యాఖ్యలపై తీవ్ర విమర్శలు రాగానే ఆయన క్షమించండంటూ ఓ వీడియో రిలీజ్ చేసి చేతులు దులుపుకున్న విషయం తాజాగా కన్పించింది.అదేవిధంగా రాజకీయ నాయకుడుగా,సినీ నిర్మాతగా ఉన్న బండ్ల గణేష్ చేసే వ్యాఖ్యలు మితిమీరుతున్నాయి.పొగడ్తలకు హద్దే లేకుండాపోతున్నాయి.ఇలా చెప్పుకుంటూపోతే ఒకరా ఇద్దరా..ఎక్కడ చూసినా ఇదే తంతు.ఇక సినీ వేడుకల్లో తారలు చేస్తున్న ప్రసంగాలు చూస్తుంటే వారికే సిగ్గుగా ఉంటుంది కావచ్చు. పొగడ్తలతో ముంచెత్తడం..వెకిలి చేష్టలు చేయడం,విషపు కౌగిలింతలు,అభినందనలు ఒకటా..ఎన్నో వికారపు దృష్యాలు కన్పిస్తూనే ఉంటున్నాయి.దేహమంతా విషం నింపుకుని పెదవుల్లో అమృతాన్ని నింపుకుని తీయని పలుకులు పలికే సినీ తారల వేడుకలకు హాజరవుతున్న రాజకీయ ప్రముఖులు కూడా వారి దారిలోనే నడుస్తుండటం గమనార్హం. సందర్భం,సమయం అనేది చూడకుండా తాము ఉన్న హెూదాలను మరచి చేస్తున్న ప్రసంగాలు రోతపుట్టిస్తున్నాయి.ఇప్పుడు తాజాగా ప్రముఖ ప్రవచనకర్త గరికపాటి నరసింహారావు ప్రభుత్వ పాఠశాలల్లో అమలు చేస్తున్న మధ్యాహ్న భోజన పథకంపై చేసిన వివాదాస్పద వ్యాఖ్యలు ప్రస్తుతం తెలుగు రాష్ట్రాల్లో పెను దుమారాన్ని రేపుతున్నాయి. ఒక ప్రసంగం సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు ఉచితంగా భోజనం పెట్టడం, పుస్తకాలు, బట్టలు ఇవ్వడాన్ని తీవ్రంగా తప్పుబట్టారు. ఈ క్రమంలో ఆయన పాఠశాలకు వచ్చే పిల్లలను "శోభనపు పెళ్ళికొడుకులతో" పోల్చడం తీవ్ర విమర్శలకు దారితీసింది. విద్యార్థులు చదువు కోసం కాకుండా కేవలం ఉచిత భోజనం కోసమే బడికి వస్తున్నారనే అర్థం వచ్చేలా ఆయన మాట్లాడటంపై నెటిజన్లు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.విద్యార్థులు తమకు కావాల్సిన వస్తువులను స్వయంగా సమకూర్చుకుంటేనే వారికి చదువుపై శ్రద్ధ ఉంటుందని, ప్రభుత్వం ఇచ్చే కోడిగుడ్ల లెక్కలు చూసుకోవడానికే ఉపాధ్యాయుల సమయం సరిపోతోందని గరికపాటి చేసిన వ్యాఖ్యలు అగ్నికి ఆజ్యం పోశాయి. దీనిపై సామాజిక మాధ్యమాల్లో స్పందించిన నెటిజన్లు, గరికపాటికి పేదరికంపై కనీస అవగాహన లేదని మండిపడుతున్నారు. కనీసం ఒక పూట తిండి దొరుకుతుందనే ఆశతో బడికి వచ్చే నిరుపేద చిన్నారులను అంత అమానవీయంగా పోల్చడం ఒక పండితుడికి తగదని పలువురు అభిప్రాయపడుతున్నారు. డ్రాపౌట్స్ తగ్గించడానికి, పోషకాహార లోపాన్ని నివారించడానికి ప్రభుత్వం చేపట్టిన ఇలాంటి మంచి పథకాన్ని కించపరచడం గరికపాటి అజ్ఞానానికి నిదర్శనమని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇలాంటి దౌర్భాగ్యపు వ్యాఖ్యలు,ప్రసంగాలు గరికపాటితో ఆగిపోతాయనుకోలేము.రేపో మాపో గరికపాటి కూడా తన వ్యాఖ్యలు ఆ ఉద్దేశ్యంతో అనలేదని ఓ వీడియో రిలీజ్ చేయడం చూడబోయేదే.అయితే ఈ దౌర్భాగ్యం గరికపాటితో నిలిచిపోతుందని అనుకోవడం అత్యాశే అవుతుంది.రేపొద్దున మరో ఘనాపాటి ఇంకో రకమైన వ్యాఖ్యలు చేయడం జరగబోయే పరిణామమే.వివిధ రంగాల్లో ప్రముఖులుగా చెలామణి అవుతున్న వారు తమ నోటిని అదుపులో ఉంచుకోవాల్సిన బాధ్యత ఎంతైనా ఉంది.వేదిక దొరికి మైకు అందితే హద్దు మీరి ప్రసంగాలు..సిగ్గుపడేలా పొగడ్తలు చేయడాలు మానుకోవాలి.హుందాగా విషయం మీద మాట్లాడితే ప్రజల్లో తమ హెూదాలు,పదవులకు గౌరవం నిలుస్తుంది.అది మరచి అనవసర ప్రసంగాలు చేస్తే జనం ఛీకొడతారు.తమ కులం వాడు వీరుడు..శూరుడు..అమెరికాకు ప్రెసిండెంట్ అవుతాడని అధిక ప్రసంగాలు చేసే నాయకులను చూశాం.ఆ ప్రసంగాలను అహెూ..ఒహెూ బ్రహ్మాండం అంటూ ఊదరగొట్టే భజన మీడియాలను చూశాం.అదంతా గతం.తమ వాడు చేసే అధిక ప్రసంగాలను కప్పిపెట్టి పరాయివాడు చేసే కార్యక్రమాలపై విషయం కక్కే కుల మీడియాలకు కూడా కాలం చెల్లింది.గోతులను కప్పిపెడ్తామంటే కుదరదు. ఇప్పుడు చీమ చిటుక్కుమన్నా వెంటనే వివిధ సామాజిక మాధ్యమాల్లో నిజాలు క్షణాల్లో వెలుగు చూస్తూనే ఉన్నాయి.కావున కులాల పునాదులు,వారసత్వ పుట్టుకల్లో ప్రముఖులుగా వెలుగొందుతున్న వారు తమ చేతలను,రోతలను అదుపులో ఉంచుకోవాల్సిందే.లేదంటే ప్రజలు ఛీకొట్టడం ఖాయమే.ఇప్పుడు జరుగుతున్నదదే.

..................................

మానసాని కృష్ణారెడ్డి
9618616110, 8074124190

# నేడు సిద్దిపేటకు సీఎం రాక

## నర్మెట్ట బహిరంగ సభలో రైతు భరోసా నిధులు విడుదల



**వాస్తవం : సిద్దిపేట ప్రతినిధి**

తెలంగాణ అన్నదాతలు ఎప్పుడెప్పుడా అని ఎదురు చూస్తున్నా రైతు భరోసా డబ్బులు నేడు జమ కానున్నాయి, యాసంగి, సీజన్ ప్రారంభం నుంచి పెట్టుబడి సహాయం కోసం అన్నదాతలు ఎదురు చూస్తున్నారు. ఈ క్రమంలోనే ఈనెల 22 నుంచి రైతు భరోసా నిధులు విడుదల చేస్తామని ప్రభుత్వం ప్రకటించడంతో రైతులు ఆనందాన్ని వ్యక్తం చేస్తున్నారు. వ్యవసాయ సాగు పెట్టుబడి కోసం రైతులు ఇబ్బంది పడకుండా ఉండాలని, నేడు రైతుల ఖాతాల్లో నగదు జమ చేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, నిర్ణయించారు. సిద్దిపేట జిల్లా నంగునూరు మండలం నర్మెట్ట వేదికగా నిర్వహించనున్న భారీ బహిరంగ సభలో సీఎం స్వయంగా బటన్ నొక్కి ఈ పథకాన్ని ప్రారంభించనున్నారు.ఈ నిధుల విడుదలపై డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర రావుతో కలిసి ముఖ్యమంత్రి సుదీర్ఘంగా సమీక్షించారు. రాష్ట్ర ఖజానాపై భారం పడకుండా, అదే సమయంలో రైతులకు సకాలంలో సాయం అందేలా ప్రభుత్వం ఒక పక్కా ప్రణాళికను సిద్ధం చేసింది. ఇందులో భాగంగానే మొత్తం నిధులను ఒకేసారి కాకుండా మూడు విడతల్లో పంపిణీ చేయాలని నిర్ణయించారు. నేరుగా రైతుల బ్యాంక్ ఖాతాల్లోకే ఈ నగదు జమ కానుంది. తొలి విడతలో భాగంగా దాదాపు 70 లక్షల మంది రైతులకు లబ్ధి చేకూరనుంది. ఒక ఎకరం వరకు భూమి ఉన్న చిన్న, సన్నకారు రైతుల ఖాతాల్లోకి ఈ నెల 22న రూ.3,590 కోట్లు చేరనున్నాయి. ఈ విడత పూర్తయిన సరిగ్గా 20 రోజుల తర్వాత రెండో విడత నిధులు విడుదల చేస్తారు. రెండో దశలో సుమారు రూ.2,650 కోట్లను పంపిణీ చేయాలని అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. దీనివల్ల ఎక్కువ భూమి ఉన్న రైతులకు కూడా ఆర్థిక తోడ్పాటు అందనుంది.ఇక ఏప్రిల్ నెలాఖరు నాటికి మూడో విడత నిధులను కూడా ఇచ్చేసి, ఈ సీజన్ రైతు భరోసా ప్రక్రియను ప్రభుత్వం పూర్తి చేయనుంది. మొత్తంగా మూడు విడతల్లో కలిపి సుమారు రూ.9,000 కోట్లు రైతుల చేతికి అందనున్నా యి. గతంలో నిధుల విడు దల ఆలస్యమవడంతో రైతులు పడ్డ ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని... ఈసారి ఎట్టి పరిస్థితుల్లో నూ ఏప్రిల్ లోపే పంపిణీ పూర్తి చేయాలని సీఎం రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. ఈ నిర్ణయంతో రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న లక్షలాది మంది రైతు కుటుంబాల్లో హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి.